



జనసేనలో చేరుతున్న ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

వైసీపీకి భారీ షాక్

- ఏలూరు రూరల్ ఎంపీపీ సహా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రాజీనామా.. జనసేనలో చేరిక

ఏలూరు రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ఏలూరు రూరల్ మండలంలో వైసీపీకి మరో భారీ షాక్ తగిలింది. పార్టీకి చెందిన ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజుతోపాటు మొండికోడు, పెదయాగనమిల్లి, కలకుర్రుకు చెందిన సర్పంచ్‌లు గోపాలకృష్ణంరాజు, టి.సులోచన, భలే ప్రసాద్, మాదేపల్లి ఉప సర్పంచ్ నరహరిశెట్టి రాధాకృష్ణ, ఎంపీటీసీలు కాకర్ల తంబి, భలే స్వాతి, నరహరిశెట్టి రాధ, దెందులూరు జనసేన ఇన్‌చార్జ్ ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో చాటపర్రులో గురువారం పార్టీలో చేరారు. ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, ఉమ్మడి పశ్చిమ జనసేన అధ్యక్షులు కొటికలపూడి గోవిందరాజు, ఏలూరు ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

శ్రీవారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవం.. చిన వెంకన్న కల్యాణం



ద్వారకాతిరుమల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సర్వాభరణ భూషితుడై.. పెండ్లి కుమారుడిగా సర్వజగద్రక్షకుడైన శ్రీ వారు.. బుగ్గన చుక్కలతో సిగ్గులొలుకుతున్న అలివేలుమంగ, ఆండాళ్ దేవేరులను పరిణయమాడారు. ఈ కల్యాణ ఘడియలో స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని వీక్షించి భక్తులు తరించారు. ఈ అద్భుత దృశ్యం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఆవిష్కృతమైంది. తొలుత రాత్రి తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి అలంకరించి ఆలయ అనివేటి మండపంలో ఏర్పాటు చేసిన వేదిక దగ్గరకు తీసుకొచ్చి అక్కడ బంగారు సింహాసనంపై కల్యాణమూర్తులను ఉంచి అర్చకులు కల్యాణ తంతును ప్రారంభించారు. పాంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిగిన ఈ కల్యాణ తంతులో ఆలయ అర్చకులు ముందుగా శాంతి హోమాన్ని జరిపి సర్వదేవతారాధన, సంకల్పం, కంకణ పూజలు నిర్వహించారు. దేవస్థానం తరపున ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, ప్రభుత్వం తరపున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు అందించారు. ఆ తర్వాత అర్చకులు మూర్తులకు మధుపర్కాలను సమర్పించారు. సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాంగల్య ధారణ, తలంబ్రాలు వైభవోపేతంగా జరిపించారు. ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి కల్యాణ ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఈఈ భాస్కర్ పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న చైర్మన్ సుధాకరరావు, ఎమ్మెల్యే మద్దిపాటి, ట్రస్టీ నివృతరావు






పెదపాడు, ఏలూరులో జోరువర్షంలో ఇలా..

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ/ఏలూరు రూరల్/పెదపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం తీరందాటినా ఇంకా జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏలూరు నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా 16 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 5.3 మి.మీగా నమోదైంది. ముదినేపల్లిలో 15.8, కలిదిండిలో 15.4, బుట్టాయిగూడెంలో 13.2, ఆగిరిపల్లిలో 10.6, భీమడోలులో 10.2, కామవరపుకోటలో 9.2, కైకలూరులో 8.4, పెదపాడులో 6.8, ఉంగుటూరులో 6.8, నిడమర్రులో 5.2, కుక్కునూరులో 4.6, జంగారెడ్డిగూడెంలో 4.6 దెందులూరులో 3.4, కొయ్యలగూడెంలో 3.2, పోలవరంలో 2.8, మండవల్లిలో 2.6, నూజివీడులో 2.4, పెదవేగిలో 2.4, ఏలూరు రూరల్‌లో 2.2, జీలుగుమిల్లిలో 1, లింగపాలెంలో 0.6 మి.మీ వర్షపాతం నమోదయింది. కాగా వర్షాలకు సార్వా వరిరైతులు ఆందోళన చెందుతున్నారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెం, సుంకరివారితోట, కోణంగి, చాటపర్రు పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం వరిపైరు పొట్ట, వెన్నుదశలో ఉంది. ఈ పరిస్థితుల్లో వర్షాలు కొనసాగితే నష్టపోతామంటూ ఆవేదన చెందుతున్నారు. పెదపాడు మండలంలో గురువారం ఏకధాటిగా వర్షం కురిసింది.



ఏలూరులో వర్షపునీటితో నిండిన రోడ్డు



తమ్ముళ్లు.. తడబడకండి

నేడు ఎమ్మెల్యేలు, ఎంపీలతో సీఎం చంద్రబాబు భేటీ

గత ప్రభుత్వ వికృత చేష్టలకు అలసిసొలసిన జనం కూటమికి అధికార పగ్గాలు అప్పగించారు. పాలనలో వంద రోజుల మైలురాయి దాటి వేగంగా ముందడుగు వేస్తూనే కూటమిలో ఎవరైనా తప్పటడుగులు వేస్తుంటే వారిని గాడిన పెట్టాలని పార్టీ, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే సహించబోమన్న హెచ్చరికలకు కూటమి నాయకత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఎంపీలు, ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు.



- ఓ వైపు పార్టీ, మరోవైపు ప్రభుత్వ ప్రతిష్టను కాపాడాల్సిందే..
- అనవసర వివాదాలు వద్దు
- ఒబ్బిడిగా ఉండండి.. ఓర్పుతో మెలగండి
- దిశ, నిర్దేశం చేయబోతున్న కూటమి నాయకత్వం
- మద్యం.. ఉచిత ఇసుక పైన చురకలకు సిద్ధం
- ఎమ్మెల్సీ ఎన్నికలపైనా ప్రత్యేక దృష్టి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఒకవైపు కొత్త మద్యం విధానాన్ని అమలులోకి తెచ్చినప్పుడు చాలాచోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యే కాస్త దూకుడుగా వ్యవహరించారని, ప్రత్యక్షంగా, పరోక్షంగా దరఖాస్తుదారులను ఇబ్బందులు పెట్టారని, ఈ కారణంగానే కొన్నిచోట్ల అనుకున్న స్థాయిలో దుకాణాలకు దరఖాస్తులు పడలేదన్న భావనలో ఉన్న తెలుగుదేశం నాయకత్వం అలాంటి వారందరికీ ఒక క్లాస్ పీకేందుకు సిద్ధపడుతోంది. ఇంకోవైపు ఉచిత ఇసుక విధానంలో ఎవరి జోక్యం ఉండకూడదని, అంతా పారదర్శకంగానే వ్యవహారం సాగాల్సిందేనన్న పట్టుదలతో ప్రభుత్వం ఉంది. దీనికి విరుద్ధంగా ఎవరైనా కూటమి ప్రతినిధుల బంధువులు, సన్నిహితులు విర్రవీగి వ్యవహరిస్తే మూల్యం చెల్లించాల్సిందేనన్న సంకేతాలను ఇవ్వబోతున్నారు. పార్టీ అనుసరిస్తున్న విధానాలు, ప్రభుత్వపరంగా తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు విషయంలో అందరికీ పూర్తి స్పష్టత ఇస్తూనే మున్ముందు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో దిశ, నిర్దేశం చేయనున్నట్టు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరవుతున్న ఈ సమావేశానికి అందరూ హాజరుకావాల్సిందేనని ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఇప్పటికే వర్తమానాలు అందాయి.

నామినేటెడ్ పోస్టులపైనే ఆతృత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పోస్టులను ఆశించే వారి సంఖ్య భారీగా పెరిగింది. కొందరు ముఖ్యమంత్రి చంద్రబాబును, ఇంకొందరు మంత్రి లోకేశ్‌ను కలిసి తమ అభ్యర్థనలు అందించారు. తొలి జాబితాలో జిల్లాకు చెందిన కొందరికే ఆయా పోస్టులు లభించగా ఇంకా వందలాది మంది ఎదురు చూస్తున్నారు. ఇదే క్రమంలో సిట్టింగ్ ఎమ్మెల్యేల పైన తీవ్ర ఒత్తిడి పెరిగింది. మంత్రులు సిఫార్సు లేఖలను అందిపుచ్చుకున్న ఇంకొంతమంది తమకు న్యాయం చేయాల్సిందేనని పట్టు పడుతున్నారు. రెండో జాబితా మరి కొద్ది రోజుల్లోనే వెలువడనుంది. ఈ విషయంలో సాధ్యమైనంత మేర సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి తమ నియోజకవర్గాల్లో కొంతలో కొంత న్యాయం చేయాలనే తపనలో ఎమ్మెల్యేలు ఉన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ గెలవాల్సిందే

పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో టీడీపీ జయకేతనం ఎగురవేయాలని ఇప్పటికే ఆ పార్టీ క్షేత్రస్థాయిలో నాయకత్వాన్ని అప్రమత్తం చేసింది. జిల్లా స్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు కూటమిలోని వివిధ భాగస్వామ్య పక్షాల నేతలు ఉమ్మడిగా హాజరై ఈ ఎన్నికలకు ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఈమధ్యనే నిర్ణయించారు. ఇదే క్రమంలో ఈ నియోజకవర్గాన్ని పార్టీ గెలుచుకునేలా ఎలాంటి చర్యలు తీసుకోవాలో మరోమారు నేడు జరగబోయే ఎమ్మెల్యేల సమావేశంలో సీఎం చంద్రబాబు దిశ, నిర్దేశం చేయబోతున్నారు. ప్రత్యేకించి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానాన్ని తామే గెలుస్తామనే ధీమాతో ఇప్పటికే నేతలున్నా.. క్షేత్రస్థాయిలో ఈ నమ్మకాన్ని మరింత పెరిగేలా చేయడం, తదనుగుణంగా ఓటరు నమోదు వ్యవహారాన్ని అందరూ భుజానకెత్తుకోవాలని టీడీపీ ఆశిస్తోంది.



ఎందుకంట భయం

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవడంలో పురుషులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు ? ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లం అవుతోంది.. - 6లో..



నాలుగు కాదు.. రెండు నెలలే

రైళ్లలో అడ్వాన్స్ రిజర్వేషన్ బుకింగ్ సమయం ఇకపై నాలుగు నెలలు కాదు.. రెండు నెలలే. ఈ నిర్ణయంతో రైలు ప్రయాణికులకు నిజంగా ఊరట కలిగించే అంశం. 6లో..



మునిసిపల్ టీచర్ల సత్యాగ్రహ దీక్ష


తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ టీచర్లు గురువారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏలూరులోని డీఈవో కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేశారు. 7లో..

వాహనాల బరువెంత..?

- ఎన్‌హెచ్ 365బీబీ రహదారి నిర్మాణానికి చర్యలు వేగవంతం



రాష్ట్ర సరిహద్దు తాటియాకులగూడెం వద్ద రహదారిపై వెళ్లే వాహనాల బరువును నమోదు చేస్తున్న దృశ్యం



జీలుగుమిల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి నాలుగు రోడ్ల కూడలి నుంచి వయా కన్నాపురం పట్టిసీమ వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారి ఎన్‌హెచ్ 365బీబీగా గుర్తించడంతో రహదారి విస్తరణకు పనుల్లో వేగం కన్పిస్తోంది. ఇప్పటికే రోడ్డు విస్తరణకు అవసరమైన భూ సేకరణ జరుగుతోంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణం చేపట్టేందుకు ఈ పాంతంలో ఏ విధమైన వాహనాల రాకపోకలు సాగుతున్నాయో తెలుసుకునేందుకు జీలుగుమిల్లి ప్రధాన సెంటరులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల రెండు రోజులపాటు రహదారిపై వెళ్లే వాహనాల వివరాలను ఎన్‌హెచ్ సిబ్బంది నమోదు చేశారు. దీంతోపాటు వాహనాల బరువు తెలుసుకునేందుకు రోడ్డుపై వేయింగ్ మిషన్ ఏర్పాటు చేసి వాహనాల బరువు నమోదు చేశారు. ఈ క్రమంలో 24 గంటల పాటు నమోదైన ఆయా వాహనాల వివరాలను ఎన్‌హెచ్ సిబ్బంది ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు చెప్పారు. దీని ఆధారంగా రోడ్డు నిర్మాణం నాణ్యత ప్రమాణాలకు తగ్గకుండా ఏ విధంగా నిర్మించాలనే దానిపై ఒక అంచనాకు వస్తారని చెబుతున్నారు. అయితే రోడ్డు విస్తరణలో ఇళ్లతో పాటు జీలుగుమిల్లి గ్రామ ఇలవేల్పు జగదాంబ అమ్మవారి ఆలయాన్ని అక్కడ నుంచి తరలించాల్సి పరిస్థితి ఏర్పడింది. జనవరిలో జాతీయ రహదారి నిర్మాణానికి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించనున్నట్టు సమాచారం.

బాధితులందరికీ న్యాయం చేస్తాం : జేసీ

బుట్టాయగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి నుంచి పోలవరం మండలం పట్టిసీమ వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో భాగంగా భూములు, ఇళ్ళు, షాపులు కోల్పోతున్న బాధితులకు న్యాయం చేస్తామని, అందరికి పరిహారం అందజేస్తామని జేసీ, కేఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాధితుల సమక్షంలో భూ రికార్డుల పరిశీలన చేశారు. ఇళ్లు కోల్పోతున్న మహిళలు జేసీని కలిసి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. మొత్తం 40 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ కోసం 12 గ్రామాల్లో 250 ఎకరాల భూమి కావాలని, అందులో 150 ఎకరాలు భూమిని రైతుల నుంచి సేకరించాల్సి ఉందని, మిగిలినది ప్రభుత్వ భూమిగా జేసీ తెలిపారు. సాధ్యమైనంతవరకు వివాదాలు లేకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ పీవీ చలపతిరావు, ఎన్‌హెచ్ తహసీల్దార్ పోతురాజు, రెవెన్యూ ఉద్యోగులు బాధితులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ఏలూరుసిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మిషన్ వాత్సల్య రెండవ త్రైమాసిక సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలపై సమాచారం అందించేందుకు జిల్లా అంతటా 1098 టోల్‌ఫ్రీ నంబర్‌ను మరింత విస్తృత పరచాలన్నారు. ప్రభుత్వం మిషన్ వాత్సల్య ద్వారా 18 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఆదరణ, సంరక్షణ అవసరమైన బాలలందరికీ రక్షణ కల్పిస్తోందన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ ఇటీవ కొన్ని హాస్టళ్లను తనిఖీ చేసిన సమయంలో గుర్తించిన లోపాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. హాస్టళ్లలోను మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సూర్యచక్రవేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి జన సురక్ష పథకాలపై అవగాహన

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి గురించి జిల్లాలో 547 గ్రామ పంచాయతీ స్థాయిలో నేటి నుంచి 2025 జనవరి 15వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో గ్రామ స్థాయిలో జనసురక్ష పథకాలపై అవగాహనా కార్యక్రమాల అమలుపై లీడ్‌బ్యాంక్ మేనేజర్ డినీలాద్రి, బ్యాంకు అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. జన సురక్ష పథకానికి ఏడాదికి రూ. 20, జీవనజ్యోతి పథకానికి ఏడాదికి రూ.436 చెల్లించాల్సి ఉంటుందన్నారు.



వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా వారి మార్గంలో పయనించి అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించగలుగుతామనేందుకు వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిదర్శనమని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి. వాల్మీకి మహర్షి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో పుష్పమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాయాజాలం!

- జంగారెడ్డిగూడెంలో 22 అనధికార లే అవుట్ల గుర్తింపు
- ప్రభుత్వ అనుమతులు,సదుపాయాలు లేకుండానే స్థలాల అమ్మకం
- ఒకసారి అమ్మిన స్థలాలే మళ్లీ విక్రయం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి అనుమతులు లేని నాన్ లే అవుట్ ఇంటి స్థలాలను ప్రజలకు మాయమాటలు చెప్పి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. తీరా స్థలం కొన్న తర్వాత ఇల్లు నిర్మించుకుందామని అప్రూవల్ కోసం మున్సిపల్ కార్యాలయానికి వెళ్తే అసలు విషయం తెలిసి ఖంగుతింటున్నారు. పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో గురుకుల పాఠశాల సమీపంలో సర్వే నంబరు 359లో 2006లో ఓ వ్యక్తి 9.40 ఎకరాల్లో అనధికార లే అవుట్ వేశాడు. ఎటువంటి అను మతులు లేకుండా, మౌలిక సదుపాయాలు కల్పించకుండానే 137 ప్లాట్లుగా విభజించి సుమారు 70 శాతం స్థలాలను అమాయకులైన ప్రజలకు అమ్మివేశాడు. ఆ తర్వాత 2007లో ఇదే తొమ్మిదెకరాల నలభై సెంట్లను రెండు భాగాలుగా విభజించి 4.70 ఎకరాలలో 58 ప్లాట్లకు, మరో 4.70 ఎకరాలకు 65 ప్లాట్లకు వేర్వేరుగా రాజమండ్రిలోని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ (ఆర్‌డీడీటీపీ) వారి వద్ద ఎల్‌పీ నంబర్లు తీసుకుని సర్వే నెంబర్లు తప్పుగా నమోదు చేసి ప్రభుత్వాన్ని మోసం చేసి దర్జాగా స్థలాలను అమ్మేశాడు. అంతేకాదు పంచాయతీకి రాసిచ్చిన పదిశాతం ఖాళీ స్థలాన్ని విక్రయించేశాడు. ఈ అనధికార లే అవుట్‌లో రెండు స్థలాలను కొనుగోలు చేసిన ఏలూరుకు చెందిన ఓ మహిళ స్థానిక మున్సిపాలిటీలో ఇంటి నిర్మాణం కోసం అప్రూవల్ ఇప్పించాలని దరఖాస్తు చేసుకోవడంతో మున్సిపాలిటీ అధికారులు నాన్ లే అవుట్‌లో అప్రూవల్ ఇవ్వడం వీలు కాదని దరఖాస్తు తిరస్కరించారు. ఆమె స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ అనధికార లే అవుట్ విషయం బయటకు వచ్చింది. ఇలా జంగారెడ్డిగూడెంలో 22 అనధికార లే అవుట్‌లలో సుమారు 60 ఎకరాల్లో స్థలాలను ప్రజలకు అమ్మేశారు.

నోటీసులు ఇచ్చాం..



ప్రజలు అనధికార లే అవుట్‌ల విషయంలో జాగ్రత్త వహించక పోతే చిక్కుల్లో పడతారు. పట్టణంలో ఇప్పటి వరకు 22 అనధికార లే అవుట్లను గుర్తించాం. అనధికార లే అవుట్‌లు వేసిన వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చి, ఆ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. తక్కువ ధరలకు వస్తున్నాయని ఎటువంటి అనుమతులు, మౌలిక సదుపాయాలు లేని లేఅవుట్లలో స్థలాలు కొనవద్దు.

- కె.వి.రమణ, మున్సిపల్ కమిషనర్, జంగారెడ్డిగూడెం




పట్టణంలో ఓ అనధికార లేఅవుట్‌లో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

తక్కువకు వస్తోందని..

వేగంగా అభివృద్ధి చెందుతున్న జంగారెడ్డిగూడెంలో డీటీసీపీ లే అవుట్‌లో గజం స్థలం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఉండగా ఎటువంటి అనుమతులు, సదుపాయాలు లేని నాన్ లే అవుట్ గజం రూ.4 వేల నుంచి రూ.5 వేలు మాత్రమే ఉండడంతో మధ్య తరగతి ప్రజలు తక్కువ ధరకు వస్తుందని ఈ స్థలాలను కొనుగోలు చేసి చిక్కుల్లో పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాన్ లే అవుట్ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయకూడదు. ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది కదా అని ఇలా నాన్ లే అవుట్ స్థలాలను విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల చివరకు స్థలాలు కొన్న జనం ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఎందుకంట.. భయం ?



కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు వెనుకంజ వేస్తున్న పురుషులు

- ఏటా రెండంకెలు దాటని వాసెక్టమీ ఆపరేషన్లు
- అపోహలు, కుటుంబ సంప్రదాయాలకు తోడు సంస్థాగత సమస్యలు
- వేలల్లో ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు

మానవ జీవితంలో పిల్లలను కనడం, కుటుంబ జీవనం గడపడం ఎంత అవసరమో అదే సమయంలో కుటుంబ నియంత్రణ కూడా అవసరం. పెరుగుతున్న జనాభాని అరికట్టడానికి కుటుంబ ఆర్థిక వ్యవస్థల్ని స్థిరపరుచుకోవడానికి కుటుంబ నియంత్రణ ఎంతో ముఖ్యం. కుటుంబ నియంత్రణకు పురుషులు చేయించుకునే వాసెక్టమీ ఆపరేషన్ల విషయంలో అనేక అపోహలు ప్రచారంలో ఉండడం వల్ల అధిక శాతం ముందుకు రావడం లేదు. మహిళలే ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. 'కోత-కుట్టు' లేని సులువైన శస్త్రచికిత్స (ఎన్ఎస్వీ)గా పేరున్నప్పటికీ వాసెక్టమీ పట్ల పురుషుల్లో నెలకొన్న అనాసక్తి నేపథ్యంలో ఉమ్మడి జిలాల్లో పరిస్థితులు, ప్రభావి తాంశాలపై ప్రత్యేక కథనం..

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి భయాందోళనలకు తావులేని వాసెక్టమీ శస్త్ర చికిత్సలను ప్రోత్సహించడానికి జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో సరైన అవగాహన కల్పించడం లేదన్న వాదన లేకపోలేదు. జిల్లాలో మహిళలకు ట్యూబెక్టమీ, పురుషులకు వాసెక్టమీ శస్త్రచికిత్సల్లో భారీవ్యత్యాసమే దశాబ్దాల తరబడి కొన సాగుతోంది. అక్షరాస్యతలో అగ్రస్థానంలో వున్న గోదావరి జిల్లాల్లో వాసెక్టమీ ఆపరేషన్లలో మాత్రం అట్టడు గునుండటం గమనార్హం. జిల్లాకేంద్రంలో సర్వజన ప్రభుత్వాసుపత్రి, చింతలపూడి, నూజివీడు,జంగారెడ్డి గూడెంలలో ఏరియా ఆస్పత్రులు, బుట్టాయ గూడెం, భీమడోలు, దెందులూరు, కైకలూరు, పోల వరంలలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. వీటితో పాటు ద్వారకా తిరుమల, సీహెచ్ పోతేపల్లి, కాగుపాడు, అగిరి పల్లిలో పీహెచ్సీలు కూడా ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లకు ఉద్దేశించారు. వీటికి అదనంగా ప్రసవాలు, కుటుంబ నియంత్రణకు ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు చేసేందుకు 57 ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఉన్నాయి.

ఏటా రెండంకెలు దాటని ఆపరేషన్లు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభజన తర్వాత ఏలూరు జిల్లాలో 2022-23 సంవత్సరంలో ట్యూబెక్టమీ ఆపరేషన్లు మొత్తం 4,481 జరగ్గా, వాసెక్టమీ శస్త్ర చికిత్సలు కేవలం 27 మాత్రమే చేయగలిగారు. 2023-24 సంవత్సరంలో ట్యూబెక్టమీ 4,476 చేయగా, వాసెక్టమీ చాలా తక్కువగా అంటే 20 తోనే సరిపెట్టాల్సి వచ్చింది. ఇక ప్రస్తుత సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆరునెలల కాలంలో ట్యూబెక్టమీ ఆపరేషన్లు 2,367 కాగా, వాసెక్టమీ 11కే పరిమితమయ్యాయి. ఇవన్నీ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జరిగినట్టుగా గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాకు వాసెక్టమీ శస్త్రచికిత్సలు ఏడాదికి 200 ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించగా, గడచిన రెండు దశాబ్దాల్లో ఏనాడూ రెండంకెలను దాటలేదు. రెండో కాన్పునకు ఆస్పత్రికి గర్భిణి వచ్చిన వెంటనే వాసెక్టమీ ఆపరేషన్పై పురు షులకు అవగాహన కల్పిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నా ప్రయోజనం అంతంత మాత్రమే.

వెనుకంజ ఎందుకంటే..

ఆపరేషన్ చేయిచుకుంటే లైంగిక సామర్థ్యం తగ్గి పోతుందనే అపోహ, భారీ పనులు చేసే శక్తి తగ్గి పోతుందనే భయాందోళనలు పురుషుల్లో ఉండటం వాసెక్టమీ ఆపరేషన్ వైపు మొగ్గు జూపక పోవ డానికి ఓ కారణం. పనిలోపనిగా మహిళలకు ప్రసవంతో పాటే ట్యూబెక్టమీ ఆపరేషన్ కూడా చేయించడం వల్ల రెండింటికీ కలిపి ఒకేసారి తగినంత విశ్రాంతి తీసుకునే వెసులుబాటు ఉంటుందనే అభిప్రాయంతో వాసెక్టమీకి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మెజార్టీ కుటుంబాల్లో మహిళలే తమ భర్త వాసెక్టమీ చేయించుకోవడానికి ఇష్టపడటం లేదని వైద్యవర్గాలు వివరించాయి.

ప్రభుత్వపరంగా లోపాలు ఇవీ

జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రుల్లో అత్యధిక శాతం వైద్యులు మహిళలకు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయడానికే శ్రద్ధ కనబరుస్తున్నారే తప్ప పురుషులకు వాసెక్టమీ చేయడానికి ముందుకు రావడం లేదు. జిల్లాలో 62 పీహెచ్సీలుండగా, వాటిలో విధులు నిర్వర్తించే వైద్యాధికారులకు ఎన్ఎస్వీ శస్త్రచికిత్సపై శిక్షణ లేకపోవడం వల్ల కేవలం 4 పీహెచ్సీల మెడికల్ ఆఫీసర్లు మాత్రమే వాసెక్టమీ ఆపరేషన్లకు పరి మితమయ్యారు. వీరిలోను వాస్తవానికి ఎన్ఎస్వీలు కేవలం ఒక్కరు మాత్రమే చేస్తున్నారని సమాచారం.

మగవారికే మంచిది



కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో పురుషులు చేయించుకోవడమే మంచిది. ఎటువంటి కోత, కుట్లు ఉండవు. నెలల తరబడి విశ్రాంతి తీసుకోవాల్సిన పనిలేదు. మహిళలకైతే బొడ్డుపైకోత చేసి గర్భసంచికి అనుసంధానమైన ఫెలోపియన్ ట్యూబులను మూసి వేయడం, కత్తిరించడం ద్వారా గర్భధారణను నియంత్రిస్తారు. ఒక్కో సందర్భంలో ఫెలోపియన్ ట్యూబు దొరకక ఆపరేషన్ ఫెయిల్యూర్ అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయి.

-విష్ణువర్థిని, గైనకాలజిస్ట్, వైద్య ఆరోగ్య కేంద్రం, పోలవరం

రెండేళ్లు ఇబ్బంది పడ్డా..



2015 సంవత్సరంలో ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను. నాకు ఒక పాప.. ఒక బాబు. ఆపరేషన్ తర్వాత దాదాపు రెండు సంవత్సరాలు విశ్రాంతి తీసుకోవలిసి వచ్చింది. ఆపరేషన్ తర్వాత దగ్గు ఉండడం వలన పైన వేసిన కుట్లు మానడానికి ఆరు నెలల సమయం పట్టింది. లోపల వేసిన కుట్లు మానడానికి దాదాపు సంవత్సర కాలం పట్టింది. రెండేళ్ల తర్వాత కానీ నా పనులు నేను చేసుకునే పరిస్థితి రాలేదు.

-సున్నం లక్ష్మీ ప్రసన్న, తోటగొంది

అపోహలు వీడాలి



ప్రభుత్వాసుపత్రుల్లో వాసెక్టమీ ఆపరేషన్ చేయించు కున్న పురుషులకు రూ.1100 నగదు ప్రోత్సాహకంగా ప్రభుత్వం ఇస్తోంది. పురుషులను ప్రోత్సహించడానికి గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశాలు పనిచేస్తున్నారు. ముఖ్యంగా చదువుకున్న ఉన్నత విద్యావంతులు ఎక్కువగా వున్న గోదావరి జిల్లాల్లో వాసెక్టమీల వైపు పురుషులను ప్రోత్సహించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై కూడా ఉంది. కోత,కుట్టు లేకుండా చర్మం కింద చిన్న నరాన్ని కట్ చేయడం తోనే వాసెక్టమీ ఆపరేషన్ అతి తక్కువ వ్యవధిలోనే ముగుస్తుంది. దీనివల్ల ఎటువంటి నొప్పి, సైడ్ ఎఫెక్ట్ ఉండవు. కొద్ది రోజుల పాటు బరువులు ఎత్తేపనులు చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

- డాక్టర్ శర్మిష్ట, డీఎంహెచ్వో, ఏలూరు

గంటలోనే వెళ్లిపోవచ్చు



వాసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్న గంట వ్యవధిలోనే ఆస్పత్రి నుంచి నడుచుకుని వెళ్ళిపోవచ్చు. అదే మహిళకు ట్యూబెక్టమీ చేస్తే కనీసం 7 రోజులవరకు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. వాసెక్టమీ వల్ల ఎస్టీడీ (సుఖవ్యాధులు) ఇన్ఫెక్షన్లు కూడా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ఎప్పుడైనా పిల్లలు/సంతానం కావాలనుకుంటే వాసెక్టమీ చేయించుకున్న పురుషులు రీకాన లజైషన్ (రీసర్జరీ) చేయించుకునే వెసులు బాటు ఉంది. కుటుంబ నియంత్రణ పద్ధతుల్లో ఎటువంటి రిస్క్ లేని శస్త్రచికిత్స ఇది.

డాక్టర్ బాలప్రకాష్, ద్వారకాతిరుమల పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్

వాసెక్టమీ అంటే.. ?

కుటుంబ నియంత్రణ కోసం పురుషులకు చేసే శస్త్ర చికిత్సే వ్యాసెక్టమీ. ఇది పూర్తిగా బాహ్యతరమైన ఆపరేషన్. బయట నుంచి చిన్న కోత లేదా గాటు ద్వారా ఆపరేషన్ చేస్తారు. ఈ ప్రక్రియ కేవలం 30 నిమిషాల సమయంలో పూర్తవుతుంది. ప్రభుత్వ



ఆసుపత్రుల్లో ఉచితంగా చేసే ఈ ఆపరేషన్లలో ఒకటి లేదా రెండు చిన్నకోతలు చేసే ముందు ఆ ప్రాంతంలో నొప్పి తెలియకుండా మొద్దుబారడానికి మత్తుమందు ఇస్తారు. కుట్లు ఉపయోగించే అవసరం కూడా ఉండదు. వైద్యులు గాయాన్ని సహజ పద్ధతిలో నయం చేస్తారు. ఆపరేషన్ అనంతరం 15 రోజులపాటు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. ఆపరేషన్ అయిన తర్వాత మూడు నెలల పాటు గర్భ నిరోధక పద్ధతులు వాడవలసి ఉంటుంది. 90 రోజుల తర్వాత వీర్య పరీక్షలు నిర్వహించి శుక్రకణాల జాడ లేకపోతే ఆపరేషన్ విజయవంతం అయినట్లు భావించాలి. వాసెక్టమీ ఆపరేషన్ ప్రక్రియ సమయంలో కొంతమంది పురుషులు నొప్పి లేదా కొంత అసౌకర్యాన్ని అనుభవించే అవకాశాలు అరుదుగా మాత్రమే ఉంటాయి. ఇన్ఫెక్షన్ లేదా రక్తస్రావం కూడా స్వల్పంగానే ఉంటుంది ఆపరేషన్ చేయించుకున్న పదిహేను రోజుల్లో యధావిధిగా తమ పనులు చేసుకోవచ్చు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల విషయంలో భార్యాభర్తలు వారి కుటుంబ ఆర్థిక, ఆరోగ్య, శారీరక పరిస్థితులకు అనుగుణంగా వ్యాసెక్టమీ లేదా ట్యూబెక్టమీ అనేది నిర్ధారించుకోవాలి. **- పోలవరం**

ఆధ్యాత్మికం





సింహవాహనంపై..శ్రీవారి రాజసం

ద్వారకాతిరుమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆశ్వయుజమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహవాహనంపై అలివేలు మంగ, ఆండాళ్ అమ్మవార్ల సమేతంగా కొలువైన ఆ దేవదేవుడు గురువారం ఉదయం క్షేత్ర తిరు వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను సింహవాహనంపై ఉంచి, అర్చకులు పూలతో అలంకరించారు. యోగ మూర్తిగా అభయ హస్తాన్ని ఇస్తూ ఉన్న శ్రీవారికి నీరాజనాలు సమర్పించారు. తరువాత అట్టహాసంగా తిరు వీధులకు తరలివెళ్లిన స్వామి, అమ్మవార్లను భక్తులు కొలిచారు. దుష్ట జన సంహారానికి, భక్తజన సంరక్షణకు సంకేతంగా స్వామి సింహవాహనంపై ఊరేగారు. ఇలా ఉన్న శ్రీవారిని దర్శిస్తే భయం, బాధలు తొలుగుతాయన్నది భక్తుల నమ్మకం.

జగన్మోహిని అలంకారంలో..

అపురూప లావణ్యాలను ఒలికిస్తూ.. మోహినీ అలంకారంలో శ్రీవారు గురువారం భక్తజనులకు దర్శనమిచ్చారు. క్షీర సాగర మదనంలో ఉద్భవించిన అమృతాన్ని దేవ, దానవులకు పంచేందకు శ్రీమహా విష్ణువు స్త్రీ రూపంలోకి మారారు.





భక్తులకు మాలధారణ చేస్తున్న ప్రధాన అర్చకుడు మల్లిఖార్జున శర్మ

మావుళ్ళమ్మ మాలధారణ

భీమవరం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో గురువారం 40 మంది భక్తులు మావుళ్ళమ్మ మాల ధారణ స్వీకరించారు. తెల్లవారుజామున ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జునశర్మ ముందుగా పూజలు చేసుకుని మాల ధారణ స్వీకరించారు. అనంతరం 40 మంది భక్తులచే విఘ్నేశ్వరపూజ, మాలలకు పూజలు చేసి హారతి ఇచ్చి అనంతరం మాలధారణ చేశారు. ఆలయ సహాయ కమిషనర్ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. పౌర్ణమి పురస్కరించుకుని చండీ హోమం నిర్వహించారు.





ఊరేగింపులో ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

తాడేపల్లిగూడెంలో వైభవంగా వెండి రథోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి 57వ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా వెండి రథోత్సవం గురువారం వేడుకగా సాగింది. ముందుగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రథాన్ని లాగి ఊరేగింపు ప్రారంభించారు. 5 రాష్ట్రాలకు చెందిన 250 మంది కళాకారులు వారి రాష్ట్ర సంస్కృతులు ప్రతిబింబించే విధంగా కళా ప్రదర్శనల నడుమ ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. 108 మంది మహిళలు 108 కళశాలతో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. పట్టణంలోని రేలంగి చిత్రమందిరం నుంచి పోలీస్ ఐలాండ్ మీదుగా ఎస్వీఆర్ సర్కిల్ వరకూ ఊరేగింపు సాగింది. ఆర్యవైశ్య సంఘ గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఒబిలిశెట్టి నటరాజ్, కొర్లేపర రాము, రథోత్సవ కమిటీ అధ్యక్షుడు నారాయణ రాంబాబు తది తరులు పర్యవేక్షించారు.



రథోత్సవం ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్



108 కలశాలతో ఊరేగింపుగా మహిళలు







యూత్ ఫుల్ జోష్

కల్చరల్

యువజనోత్సవాల్లో టాలెంట్ను ప్రదర్శించిన యువత

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గగనమే గమ్యంగా కళాశాల యువత కళా ప్రదర్శనలతో ప్రతిభ కనబరచి శెభాష్ అనిపించు కున్నారు. గ్రామీణ భారతీయ కళాభినయాలు, నృత్యాలతో పాటు, పెయింటింగ్, కథారచన, కవితలు, నూతన ఆవిష్కరణలు, అంకుర సంస్థలు, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన పోటీల్లో యువ శక్తిని, మేథోసంపత్తిని బాహ్యప్రపంచానికి చాటి చెప్పారు. మొత్తం 11 ఈవెంట్లలో ఏలూరు జిల్లా లోని 15 డిగ్రీ కళాశాలలు, నూజివీడు ట్రిపుల్ ఐటీ, తాడేపల్లిగూడెం ఉద్యాన విశ్వ విద్యాలయం తదితర సాంకేతిక విద్యాసంస్థల నుంచి మొత్తం 250 మంది విద్యార్థులు ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో సందడి చేశారు. వివిధ పోటీల గ్రూప్, సోలో విభాగాల నుంచి ప్రథమస్థానం విజేతలను నవంబరులో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు పంపిస్తామని సెట్వెల్ సీఈవో కె.ఎస్.ప్రభాకరరావు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబందించి యువజ నోత్సవాలను ఈనెల 26న తణుకులో నిర్వహించనున్నట్టు వివరించారు.ప్రారంభ కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ యువతలోవున్న ప్రతిభను వెలికితీయడానికి యువజనోత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. తొలుత స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేశారు. జిల్లా యూత్ ఆఫీసర్ డి.కిషోర్, డీఆర్డీఏ పీడీ విజయరాజు, మైనార్టీస్ వేల్ఫేర్ ఆఫీసర్ కృపావరం, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ మధుభూషణరావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రజిత, టూరిజం అధికారి పట్టాభి, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు :

జానపదనృత్యం గ్రూప్డ్యాన్స్లో సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలకు చెందిన లక్ష్మీ ప్రసన్న గ్రూప్ ప్రథమ, చింతలపూడి ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన సావిత్రి గ్రూప్ ద్వితీయ, కైకలూరు వై.వి.ఎన్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మీనాక్షి గ్రూప్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. సోలో విభాగంలో ఆదిత్య డిగ్రీ కళాశాలనుంచి బి.జాహ్నవి, పి.నవీన, సెయింట్ థెరిస్సా కళాశాల నుంచి ఎం.ప్రీతిశ్రీజ విజేతలుగా నిలిచారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ఆవి ష్కరణల పోటీ వ్యక్తిగత విభాగంలో సెయింట్ థెరిస్సా కళాశాల విద్యార్థినులు ఎన్.అఖిల, పి.వి.దీప్తి, ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి పి.గణేష్ విజేతలుగా నిలిచారు. ఇదే పోటీ గ్రూప్ విభాగంలో సెయింట్ థెరిస్సా కళాశాల నుంచి కె.లక్ష్మీదుర్గ, ఎస్కే.జాస్మిన్ బృందం, కె.అఖిల, కె.సాహ్నవి బృందం, ఎస్కే. జీనత్, విశ్రవంతి బృందాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.పద్యాల పోటీ తెలుగు విభాగంలో సీఆర్ఆర్ కళాశాలనుంచి కె.జయఫణీంద్ర, చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఆర్.సంతోష్, తాడేపల్లిగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి డి.రాజ్యలక్ష్మి, ఇంగ్లీషు విభాగంలో సెయింట్ థెరిస్సా కళాశాల నుంచి ఎం.డి బషీరున్, డి.రేణు షాసాస్, కె.దామిని సుధ విజేతలుగా నిలిచారు. జానపద పాటలపోటీ సోలో నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి పి.కళ్యాణ్ హరితాస్, కె.ప్రశాంత్, సెయింట్ థెరిస్సా కళాశాల నుంచి కె.దామిని సుధ గ్రూప్ విభాగంలో ట్రిపుల్ ఐటీ నుంచి కె.ప్రశాంత్ బృందం, సెయింట్ థెరిస్సా కళాశాల నుంచి చిన్నారి బృందం, ట్రిపుల్ ఐటీ నుంచి డి.నవ్యశ్రీ బృందం విజేతలుగా నిలిచాయి. స్టోరీ రైటింగ్ పోటీలో సెయింట్ థెరిస్సా నుంచి కె.దామినిసుధ, ఎ.సుజాతరావు, సీఆర్ఆర్ కళాశాలనుంచి జి.పద్మావతి విజేతలుగా నిలిచారు. పెయింటింగ్లో ఏలూరుకు చెందిన మహ్మద్ సమీర్, ఎస్.దివ్య, సీహెచ్.గాయత్రి వక్తృత్వంలో ఆదిత్య డిగ్రీ కళాశాల నుంచి జె.క్రిషిత, కె.నవ్యశ్రీ, నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి ఎన్.పద్మజ విజేతలుగా నిలిచారు.



వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న జడ్పీ చైర్పర్సన్..



విద్యార్థినుల జానపద గీతాలాపన..



జానపద నృత ప్రదర్శన

రైల్వే ప్రయాణికులకు తీపి కబురు

అడ్వాన్స్ రిజర్వేషన్ బుకింగ్ రెండు నెలలకు కుదింపు



నరసాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులకు గురువారం ఆ శాఖ తీపికబురు చెప్పింది. అడ్వాన్స్ రిజర్వేషన్ టిక్కెట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వస్తున్న విమర్శల్ని పరిగణలోకి తీసుకుని టిక్కెట్ బుకింగ్ సమయాన్ని 60 రోజులకు తగ్గించింది. అంటే నాలుగు నెలల ముందుగా అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించు కోవాల్సిన అవసరం లేదు. రెండు నెలలు ముందుగా బుకింగ్ చేసుకుంటే సరిపోతుంది. ఈ కొత్త విధానం వచ్చేనెల నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటి వరకు రిజర్వేషన్ బెర్త్లో ప్రయాణించాలంటే 120 రోజుల ముందుగా మేల్కోవాల్సి వచ్చేది. పండుగలు, వేసవి సెలవులకు దూర ప్రాంతాలు, స్వగ్రామాలకు రావాలంటే నాలుగు నెలల ముందుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకోవడం తప్ప నిసరిగా ఉండేది. లేకపోతే దొరకని పరిస్థితి. సంక్రాంతి, దసరా, వేసవి సెలవులకు రోజులు లెక్కించుకుని అడ్వాన్స్గా రిజర్వేషన్ బుక్ చేసుకోవాల్సి వచ్చేది. ఈ విధానం వల్ల కొన్ని సమయాల్లో టిక్కెట్లు రద్దు చేసుకోవాల్సి వచ్చేది. దీంతో భారీగా కోత పడేది. కొన్ని సమయాల్లో సగం డబ్బులు కూడా తిరిగి వచ్చేవి కావు. ఈ వ్యవధిని 60 రోజులకు కుదిం చాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. చివరికి రైల్వే స్పందించి రెండు నెలల ముందుగా టిక్కెట్లు బుక్ చేసుకునే వెసులు బాటు కల్పించింది. దీని వల్ల జిల్లాలో ఎప్పుడు రద్దీగా ఉంటే నరసాపురం, నాగర్సోల్, తిరుపతి, సర్కార్, శేషాద్రి వంటి రైళ్ళకు ప్రయాణ వ్యవధిని బట్టి 60 రోజులు ముందు గానే బుక్ చేసుకోవచ్చు. ప్రయాణ వ్యవధి తక్కువగా ఉన్నందున టిక్కెట్ల రద్దు కూడా తగ్గుతుంది.

పేరుపాలెం బీచ్ వద్ద ఏర్పాట్లు చేయాలి : ఆర్డీవో

నరసాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) కార్తీక వన సమారాధనకు పేరుపాలెం బీచ్కు వచ్చే సందర్శకులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని నరసాపురం ఆర్డీవో దాసిరాజు సూచించారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి కార్తీకమాసం ప్రారంభం కానున్నందున బీచ్కు వచ్చే వారికి కల్పించాల్సిన వసతులపై వివిధశాఖల అధికారులతో గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. తాగునీరు, తాత్కాలిక టాయ్ లెట్స్, సందర్శకులు సేద తీరేందుకు తాత్కాలిక గుడిసెల నిర్మాణంతో పాటు ప్రాణ నష్టం జరగకుండా గజ ఈత గాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. బీచ్కు వెళ్లే రహదారులు, తీరం వెంబడి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బం దిని నియమించాలని తీరం నందు కార్తీకమాసం నెల రోజులు పాటు మద్యం అనుమతించవద్దని సూచించారు. డీఎస్పీ మురళీ కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాలమ్



జిల్లా స్థాయి చెస్ పోటీల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

రేపు భీమవరంలో జిల్లా స్థాయి చదరంగ పోటీలు

భీమవరం అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా చదరంగ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ శనివారం భీమవరంలోని ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో జరిగే జిల్లా స్థాయి రెండో ర్యాకింగ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల బ్రోచర్లను గురువారం ఆవిష్కరించారు. ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ విజేతలు నవంబరు నెలలో జరిగే రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ పోటీలకు ఎంపికవుతారన్నారు. విజేతలకు అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం బహుమతులు ,మెమెంటోలు అందిస్తారన్నారు. వివరాల కోసం 90632 24466 నంబర్లో సంప్రదించాలన్నారు.అల్లు రామకృష్ణ, సరిత, చెరుకువాడ రంగసాయి, అల్లుశ్రీనివాస్, చెస్ అసోసియేషన్ సభ్యులు మైలాపురి మురళి, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఆర్కెఆర్లో 19, 20 తేదీల్లో బ్యాడ్మింటన్ పోటీలు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఎస్ఆర్కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 19, 20 తేదీల్లో జేఎన్టీయూకే బ్యాడ్మింటన్ మెన్ అండ్ ఉమెన్ సెంట్రల్ జోన్ టోర్నమెంట్ పోటీలు జరుగుతాయని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జగపతిరాజు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 26, 27 తేదీలలో బాస్కెట్ బాల్, నెట్బాల్ మెన్ అండ్ ఉమెన్ సెంట్రల్ జోన్ పోటీలు కూడా తమ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ సురేష్బాబు, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణరాజులు మాట్లాడుతూ సౌత్ జోన్కు వెళ్లే టీమ్స్ను కూడా ఇక్కడే యూనివర్సిటీ స్పెషల్ టీమ్ సెలక్ట్ చేస్తుందన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్టస్థాయి వాలీబాల్ పోటీలకు గణపవరం విద్యార్థి అఖిల్ శ్రీవర్మ

గణపవరం, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 17: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-14 వాలీబాల్ సెలక్షన్ పోటీల్లో గణపవరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి అఖిలశ్రీవర్మ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన సెలక్షన్ పోటీల్లో ఎంపి కైనట్టు పీడీ ఎం.పద్మావతి తెలిపారు. వర్మను ఉపాధ్యాయులు, అభినందించారు.



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న హరినాథ్‌బాబు

భీమవరంలో జాగ్వార్ షోరూమ్

భీమవరం టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గోవర్ధన్ థియేటర్ రోడ్డులోని నిర్మలా హోమ్ మార్టులో జాగ్వార్ ఎక్స్‌క్లూజివ్ షోరూంను సూర్య ఇంటర్నేషనల్ ఎండీ డాక్టర్ పి.హరినాథ్ బాబు, ఆంధ్ర, తెలంగాణ బ్రాంచి హెడ్ అభిజిత్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హరినాథ్ బాబు మాట్లాడుతూ భీమవరం పట్టణంలో వ్యాపార రంగం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని, ఈ ప్రాంతంలో జాగ్వార్ సంస్థను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. మేకింగ్ ఇండియా ప్రొడక్ట్ అని, 60 దేశాల్లో విస్తరించి ఉందని, హైదరాబాద్‌లో అతి పెద్ద షోరూంను ప్రారంభించబోతున్నామని, ల్యాబ్‌లను కూడా ఏర్పాటు చేసి ట్రైనింగ్ కూడా ఇవ్వడం జరుగుతుందని, జాగ్వార్ సర్వీస్‌లోగాని, ప్రొడక్టులోగాని అందరి మన్ననలు పొందుతుందని అన్నారు. జాగ్వార్ లైటింగ్ కూడా భీమవరంలో త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. మేనేజింగ్ పార్టనర్స్ సురేంద్ర పలివెల, శ్రీకాంత్ పలివెల మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ప్రొడక్టు అందించడమే లక్ష్యమని అన్నారు. ఉద్దగిరి శివ, రవి కంతేటి, రవివర్మ, తటవర్తి నవీన్, రాహుల్, నిర్మల్ పాల్గొన్నారు.



మేడపాడులో శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల

పల్లెల ప్రగతి ఎన్డీఏతోనే సాధ్యం: మంత్రి నిమ్మల

యలమంచిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశానికి పట్టుకొమ్మలు పల్లెసీమలు అని వాటి ప్రగతి ఎన్డీఏ ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆర్యపేట, మేడపాడు గ్రామాల్లో గురువారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రి రామానాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యపేటలో రూ.10లక్షలు, మేడపాడులో రూ.20 లక్షలు నిధులతో నిర్మించనున్న సీసీ రహదారుల పనులకు మంత్రి రామానాయుడు భూమిపూజ నిర్వహించారు. మేడపాడు, ఆర్యపేటగ్రామాల్లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు మంత్రి రామానాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యంచేసి సర్పంచ్‌లను భిక్షాటన చేసేలా పంచాయతీల్లో చిల్లిగవ్వ లేకుండా చేస్తే, నేడు ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామాల్లో రూ.4500కోట్లతో 30వేల పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లను మహిళలకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మామిడిశెట్టి పెద్దిరాజు, చల్లా నరేంద్రకుమార్, తాడి శశిధర్, ముచ్చర్ల శ్రీనివాస్, ఆరుమిల్లి రామశ్రీనివాస్, మాతా రత్నంరాజు, పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ
ఆదాయం లెక్కింపు

కాళ్ళ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 127 రోజులకు గాను 19 లక్షల 36వేలు 321 రూపాయలు వచ్చాయని కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. పండితవిల్లూరు సమూహ దేవాలయాల కార్యనిర్వహణాధికారి దండు వెంకట కృష్ణంరాజు, గ్రామ పెద్దలు, దేవస్థానం సిబ్బంది సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు.



క్రైమ్ కార్నర్

రైలు కింద పడి
యువకుడి మృతి
అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని సత్రంపాడు లోబ్రిడ్జి వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి తిరుపతి నుంచి కాకినాడ వెళ్ళే రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 35 నుంచి 40 ఏళ్ళ వయస్సు కలిగి ఉన్నాడు. 5.5 అడుగుల ఎత్తు, గజ్జకాయ రంగు పొట్టి చేతుల చొక్కా, నీలం రంగు లోయరు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్‌ఐ పి సైమన్ సెల్‌నెంబర్ 99892 19559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

మహిళపై దాడి చేసిన
యువకుడిపై కేసు

నరసాపురం. అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని కాటన్‌పార్కులో గురువారం ఓ యువతిపై దాడికి పాల్పడిన ప్రేమ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ జయలక్ష్మి చెప్పారు. యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితుడు మొగల్తూరు మండలానికి చెందిన వాడిగా గుర్తించామన్నారు.

మహిళను రక్షించిన పోలీసులు

భీమవరం క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్యభర్తల కలహాలతో గురువారం నాడు భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. దీంతో రైల్వే పోలీసులు గమనించి ఆ మహిళను కాపాడారు. మహిళను విచారించగా పట్టణంలోని నరసయ్య అగ్రహారం చెందిన ధనాల లక్ష్మీగీతగా గుర్తించారు. గీత భర్త స్వామి కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తారన్నారు. ఈమేరకు భర్తను పిలిపించిన రైల్వే ఎస్‌ఐ రమణ ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

రెండు వాహనాలు ఢీ
యువకుడి మృతి

పోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోడూరు చేపలు చెర్వులు వద్ద గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో బండి గేణేశ్వరరావు(22) మృతి చెందాడు. ఎస్‌ఐ కె.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. పెనుమంట్ర మండలం నౌడూరు గ్రామానికి చెందిన గణేశ్వరరావు పోడూరు నుంచి మినిమించిలిపాడు వెళ్తుండగా ఆచంట వేమవరంకు చెందిన వరద శివరామకృష్ణ మినిమించిలిపాడు నుంచి పోడూరు వస్తున్నాడు. దీంతో వీరి వాహనాలు రెండూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో బండి గణేశ్వరరావు(22) తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శివరామకృష్ణకు తీవ్రగాయాలు కావడంతో భీమవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

అన్నపై హత్యాయత్నం కేసు

పోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొమ్ముచిక్కాలలో తమ్ముడిపై హత్యాయత్నం చేయబోయిన అన్నపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోడూరు ఎస్‌ఐ కె.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. చింతపల్లి కుమారస్వామి, చింతపల్లి వీరవెంకట సత్యనారాయణ అన్నదమ్ములు. వీరిద్దరికీ ఆస్తి పంపకంలో చాలా కాలంగా తగాదా పడుతున్నారు. గురువారం ఆస్తి విషయంలో మళ్లీ తగాదా పడ్డారు. ఈక్రమంలో అన్న వీరవెంకట సత్యనారాయణ తన తమ్ముడు కుమారస్వామిని కత్తితో కాలిపై గాయపర్చాడు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్నపై హత్యాయత్నం కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

కాళ్ళ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఫిర్యాదుపై కాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఏలూరుపాడు గ్రామానికి చెందిన అదిగిరి నాగలక్ష్మికి ఆకివీడు మండలం దుంపగడప గ్రామానికి చెందిన మావుళ్ళయ్యతో సుమారు 26 ఏళ్ళ క్రితం వివాహం అయ్యింది. అయితే పెళ్లైయిన ఇన్ని సంవత్సరాలకు ఆమెను మరో లక్ష రూపాయలు అదనపు కట్నం తీసుకురావాలంటూ అత్తింటివారు వేధిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై కాళ్ళ ఎస్‌ఐ నాళం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిన్నారులకు అందని
కొత్త పుస్తకం



అంగన్‌వాడీ కేంద్రాల్లో పాత పుస్తకాలతోనే బోధన

అత్తిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచాయి. ఇంకా అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త పాఠ్య పుస్తకాలు చేరలేదు. ఫలితంగా చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆటంకం కలుగుతున్నది. అరకొరగా ఉన్న పాతవాటితోనే బోధన సాగిస్తున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. కొందరు ఇంటి నుంచే రాత పుస్తకాలు తీసుకుని వచ్చి సాధన చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం త్వరితగతిన పాఠ్యపుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లి దండ్రులు కోరుతున్నారు. జిల్లాలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో 1556 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు కాగా 70 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడు నుంచి 6 సంవత్సరాల పిల్లలు 19678 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పూర్వ ప్రాథమిక విద్య అందించి ఆ తరువాత వారు నేరుగా ఒకటవ తరగతిలో చేరేలా అధికారులు గతంలో చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు పాఠ్యపుస్తకాలపై రూపకల్పనతో పాటు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేశారు. పీటీ (ప్రీ ప్రైమరీ) 1,2 పేరిట రెండు రకాల పుస్తకాలను పంపిణీ చేసి వాటి ఆధారంగా విద్యా బోధన జరిపేవారు. పాటలు, పద్యాలతో పాటు నెలలు, వారాలు, రోజులు తదితర అంశాలను వివరించే వారు. ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఏ రోజు ఏమి బోధించాలనేది పట్టిక రూపంలో ఇస్తూ ఉండేవారు. ఆంగ్లంలో సులువుగా అర్థమయ్యే పదాలు చెప్పడం వాటి అర్థాలు తెలుసు కోవడం, సృజనాత్మకత ఆటలు వంటి నృత్యాలు చేయించేవారు. ప్రస్తుతం పుస్తకాలు రాకపోవడంతో అవిఏమి సక్రమంగా అమలు కావడం లేదు.

పునఃశ్చరణకు దూరం

చిన్నారులు విద్య నేర్చుకోవడంలో తల్లి దండ్రుల పాత్ర కూడా ఉండాలనే ఉద్దేశంతో అధికారులు గతంలో ఒక నిర్ణయం తీసుకున్నారు. కేంద్రాలకు వచ్చే పిల్లల తల్లుల ఫోన్ నెంబర్లతో తరగతుల వారీగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా కేంద్రాల్లో ఉదయం బోధించిన అంశాలు, చేయించిన వాటికి సంబంధించిన వివరాలను వాట్సప్‌లో పంపేవారు. సాయంత్రం ఇంటి వద్ద పునఃశ్చరణ చేయించేవారు. ప్రస్తుతం పుస్తకాలు లేకపోవడంతో అదేమి జరగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం త్వరితగతిన పాఠ్యపుస్తకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మునిసిపల్ టీచర్ల సత్యాగ్రహ దీక్ష

ఎడ్యుకేషన్



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలు తెరవాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పండిట్, పీఈటీ పోస్టులను అప్ గ్రేడ్‌చేసి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఖాళీగా వున్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైనవారికి పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీచేయాలన్నారు. పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించా లన్నారు. అప్‌గ్రేడ్‌చేసిన ప్రాథమి కోన్నత పాఠ శాలల్లో సబ్జెక్టు టీచర్ల నియామకాలను చేపట్టా లన్నారు. టీచర్ల సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబరు 24న పాఠశాలవిద్య కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడ తామని హెచ్చరించారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.



లావణ్య, జాహ్నవి, ఉషా కిరణ్

అగ్రిసెట్‌లో మార్టేరు
విద్యార్థుల ప్రతిభ

పెనుమంట్ర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు అగ్రిసెట్-2024 ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆగస్టు 27వ తేదీన నిర్వహించిన అగ్రిసెట్- 2024 పరీక్షా ఫలితాల్లో మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థిని మట్టా లావణ్య, పి. జాహ్నవి, జక్కి ఉషా కిరణ్ రాష్ట్ర వ్యాప్తంగా 2, 4, 14 ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్, పరిశోధనా సహ సంచాలకులు డాక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 1469 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 1447మంది అర్హత సాధించారని తెలిపారు. మార్టేరు నుంచి అగ్రిసెట్- 2024కు 32 మంది హాజరు కాగా 100 లోపు 11 మంది, 200 లోపు 17 మంది ర్యాంక్ సాధించారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నామాల శ్రీనివాసరావు తెలిపారు. రెండు సంవత్సరాల వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులు అగ్రిసెట్ ద్వారా బీఎస్సీ అగ్రికల్చర్ డిగ్రీ లో చేరటానికి అర్హత సాధిస్తారు.

నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా
ప్రొఫెసర్ రమణారావు



తాడేపల్లిగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీనిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా రాయపూర్ (చత్తీస్‌ఘడ్) డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్వీ రమణారావు నియమితులయ్యారు. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసిందని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి గురువారం తెలిపారు. గతంలో ఈయన వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్‌గా పని చేశారని, త్వరలోనే ఏపీనిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపడతారన్నారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డైరెక్టర్‌గా హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి వ్యవహరించారు.

నూరుశాతం అక్షరాస్యత
లక్ష్యంగా ఉల్లాస్

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నూరు శాతం అక్షరాస్యత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నూతన అక్షరాస్యత కార్యక్రమం 'ఉల్లాస్' జిల్లాలో అమలు కు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కన్వర్జెన్సీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. స్వయం సహాయ సంఘాలు లబ్ధిదారులు, ఆయాలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే నైట్ వాచ్మెన్‌లను అక్ష రాస్యులుగా తీర్చిదిద్దేందుకు దృష్టి సారించాలన్నారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జి.సీహెచ్ ప్రభాకర్, కమిటీ సభ్యులు డీఆర్ డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఈవో జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో
ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వినూత్న పరిష్కారాలను ప్రదర్శించి తమ ప్రతిభను కనబరిచారని, నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్, ఏవో లక్ష్మణరావు తెలిపారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీ కేంద్రంగా పారాబోలా9 సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15,16 తేదీల్లో హ్యాకథాన్ నిర్వహించగా, మొత్తం 12 జట్లు పాల్గొని తమ వినూత్న పరిష్కారాలను ప్రదర్శించాయన్నారు. ఈ హ్యాకథాన్ ద్వారా విద్య, పరిశ్రమల మధ్య అంతర్యాన్ని తగ్గించేందుకు అవకాశం ఏర్పడిందని, ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో పారాబోలా సంస్థ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ప్రణవమూర్తి, డీన్‌ఆఫ్ అకడమిక్స్ శ్రావణి, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బండి ప్రసాద్, సీఎస్ఈ హెచ్‌వోడి నాగార్జునాదేవి పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అమెరికా విశ్వవిద్యాలయ ప్రతినిధులు

ఉన్నత విద్యనభ్యసిస్తే ఎన్నో అవకాశాలు

పెంటపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : భారతీయ విద్యార్థులు యూఎస్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తే అపార అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునని ఏపీనిట్ డీన్ స్టూడెంట్స్ కెరీర్ అలుమ్ని అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ కార్తీక్ శేషాద్రి సూచించారు. నిట్‌లో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్, అలుమ్ని ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఇనిక్షా కేరీర్ కన్సల్టెన్సీ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికాలోని తొమ్మిది విశ్వ విద్యాలయాల ప్రతినిధులతో హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్ అసోసియేట్ డీన్‌లు డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ జి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ యూ ఎస్‌ఏలో ఉన్నత విద్యను అభ్యసించాలని చాలా మంది విద్యార్థులు కలలు కంటారు. కానీ ఏ విశ్వ విద్యాలయంలో ఎటువంటి కోర్సులు ఉంటాయి, వసతులు వంటి విషయాలు తెలియక ఎంతో మంది వెనకడుగు వేస్తున్నారని తెలి పారు. యూఎస్ వెళ్ళి తమ భవిష్య త్‌ను ఉన్న తంగా తీర్చిదిద్దాలనుకునే విద్యార్థులకు ఈ ఫెయిర్ ఎడ్యుకేషన్ దోహదపడుతుందని వివరించారు.

ఆర్టీసీ అధికారులకు
గెజిటెడ్ హోదా

ఏలూరు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో వీలినం చేశారు. అందులో పనిచేసే అధికారులకు గెజిటెడ్ హోదా కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాజపత్రాన్ని విడుదల చేసింది. ఆర్టీసీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు గెజిటెడ్ లెవెల్ -5 హోదా కల్పించారు. రీజినల్ మేనేజర్ దానికి సమానమైన హోదాలో ఉన్న అధికారులకు గెజిటెడ్ లెవల్ -4గా కల్పించారు. డివిజనల్ మేనేజర్ అండ్ దానికి సమానమైన హోదాకు గెజిటెడ్ లెవెల్ -3గా హోదా కల్పించారు. జూనియర్ స్కేల్ సర్వీస్ వారికి గెజిటెడ్ లెవెల్ -2గా హోదా కల్పించారు. అసిస్టెంట్ మేనేజర్ (ఫైనా న్స్), అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్), అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్), అసి స్టెంట్ మేనేజర్ (స్టాటిస్టిక్స్), అసిస్టెంట్ మేనేజర్ (మెటీరియల్స్ పర్చేజ్)లకు, నర్సింగ్ సూపరింటెండెంట్, చీఫ్ సెక్యూర్టీ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్), అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రి కల్), అసిస్టెంట్ ఇంజనీర్ (మెకాని కల్)లకు గెజిటెడ్ లెవెల్ -1గా హోదా లు కల్పిస్తూ రాజపత్రంలో పేర్కొన్నా రు. దీంతో ఆర్టీసీ అధికారులు ఇకపై గెజిటెడ్ అధికారులుగా గుర్తింపు పొందనున్నారు.



మాట్లాడుతున్న కృష్ణమాచార్యులు

31 నుంచి పారిశుధ్య
కార్మికుల సమ్మె

ఏలూరు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రులలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు పీఎఫ్ బకాయిలు కాంట్రాక్టర్ చెల్లించకపోతే ఈనెల 31వ తేదీ నుంచి సమ్మె చేస్తామని ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, జిల్లా కార్యదర్శి దత్తాత్రేయ (దత్తు) ప్రకటించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఆ సంఘ కార్యవర్గ సభ్యులు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నెలల జీతాలు పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని, కాంట్రాక్టర్‌కు ఉన్న కాంట్రాక్టు నవంబర్ నెలతో ముగుస్తుందని ఈ నెలాఖరులోపు తమ సొమ్ములను చెల్లించకపోతే ఈనెల 31వ తేదీన సమ్మె ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ మేరకు నోటీసులను అందించామన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి అంచలంచల నిరసన కార్యక్రమాలు చేపడతామని, జిల్లాలో అన్ని ఆసుపత్రుల్లోని కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి గంట పాటు నిరసన తెలియజేస్తారన్నారు.

రొయ్యలు, చేపల్లో వ్యాధులు గుర్తించాలి



మత్స్య సహాయకులకు ల్యాబ్‌లో శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఉండి అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రొయ్యలు ..చేపల్లో వచ్చే వ్యాధులను సమయానుకూలంగా గుర్తించి వాటికి తగిన చర్యలు చేపట్టాలని ఉండి కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.మల్లిఖార్జునరావు, మత్స్య శాస్త్రవేత్త డా.ఎ.శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఎస్‌ఆర్‌పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మత్స్యసహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. డాక్టర్ మల్లిఖార్జునరావు, డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో చేపలు, రొయ్యలు పెంపకం వరి తరువాత అతిముఖ్యమైనదన్నారు. చేపలు, రొయ్యల పంటలు పండించే ఆక్వారైతులకు మత్స్యసహాయకులు అందుబాటులో వుండి తగిన సూచనలు సలహాలు ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. వరిపంటలా కాకుండా చేపలు, రొయ్యలలో నష్ట అధికంగా వుంటుందని అన్నారు. ప్రస్తుతం చేపల్లో ఎక్కువగా రెడ్ డీసీజ్, శంఖు, జలగ, చేప పేను, పొట్ట ఉబ్బు వ్యాధి కనిపిస్తున్నాయని తెలిపారు.

వర్షా కాలంలో తీసుకోవలసిన చర్యలు

వర్షాలు పడుతున్న సమయంలో చేపలు, రొయ్యలలో తగు చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ప్రస్తుత సమయంలో నీటి నాణ్యత ఎంతో అవసరమన్నారు. నీటి నాణ్యతను మెరుగు పరచడానికి సున్నం ఎకరానికి 30కేజీలు చల్లుకోవాలని సూచించారు. వెంకటరామన్నగుడెంకు చెందిన మత్స్యశాస్త్రవేత్త డా.దేవి వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రొయ్యల వ్యాధుల యాజమాన్యం గురించి వారికి వివరించారు. చెరువులో నీటిని నింపి, బ్లీచింగ్ పౌడరుతో శుద్ధి పరచుకోవాలన్నారు. తరువాతే ధ్రువీకరణ హ్యాచరీ నుంచి రొయ్యపిల్లలు తెచ్చుకుని వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వినయలక్ష్మీ, రజిత, వివిధ గ్రామాల నుంచి మత్స్యసహాయకులు హాజరయ్యారు.



బైనేరు వంతెన పై పడ్డ గోతులు

తల్లాడ - దేవరపల్లి రహదారిపై గోతులు

కొయ్యలగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తల్లాడ, దేవరపల్లి జాతీయ రహదారి పై భారీ గోతులు పడడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తాయి. లారీలు, కార్లతో రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. కొయ్యలగూడెం మార్కెట్‌యార్డు వద్ద జంగారెడ్డిగూడెం బైనేరు వంతెనపై పెద్ద పెద్ద గోతులుపడ్డాయి. కార్లు అదుపు తప్పి ప్రతీరోజు ప్రమాదం జరుగుతోంది. ఈ వారంలోనే మూడు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు గాయపడ్డారు. హైవే అధికారులు తక్షణం స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



కొమ్ముగూడెం దారిలో ఎర్రకాలువ

కాలువ దాటడం కష్టమే..!

టి.నరసాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొమ్ముగూడెం వైపు పొలాలున్న రైతులు ఎర్రకాలువ దాటి వెళ్లాలి. కొద్దిపాటి వర్షం పడినా కాలువ దాటడం కష్టం. టి.నరసాపురం - కొమ్ముగూడెం మార్గంలో ఎర్రకాలువ అవతల వైపు సుమారు 3వేల ఎకరాల్లో పంటలను పండిస్తున్నారు. 25 ఏళ్ల నుంచి ఎర్రకాల్వపై వంతెన నిర్మించాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను, రైతులు అడుగుతునాన్న ప్రయోజనం లేదు. పంట తరలించే సందర్భంలో కాలువ వద్ద ట్రాక్టర్లు బోల్తా పడిన సంఘటనలు అనేకం. ఇటీవల పామాయిల్ లోడు ట్రాక్టర్ బోల్తా పడిందని రైతులు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఎర్ర కాలువపై వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు.



రహదారికిరువైపులా పొదలు

పొదల్లో రహదారి!

జీలుగుమిల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల రహదారులు తుప్పలతో దర్శనమిస్తున్నాయి. కామయ్యపాలెం నుంచి రావన్నగూడెం, అంకన్నగూడెం, గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లే రహదారి ఇలా పొదలతో కమ్మేసింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. గిరిజన గ్రామాల్లో అధిక వర్షాలతో తుప్పలు మరింత దట్టంగా అలుముకుంటున్నాయి. ప్రమాదాల నివారణకు తుప్పలు తొలగించాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

చెత్త కాల్వ

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏలూరు కాలువ తూర్పు లాకుల నుంచి పడమర లాకుల వరకు అస్తవ్యస్తంగా తయారైంది. కాలువలో వ్యర్థాలు, చెత్తతో ఆ ప్రాంతాలన్నీ దుర్గంధం వస్తోంది. నీరు పారుదలకు వ్యర్థాలు అడ్డంకిగా తయారయ్యాయి. ఏలూరు కాలువ సమీప ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు పెరిగాయని, అంటువ్యాధులు కూడా ప్రబలుతాయనే ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్యం మెరుగుపర్చడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. పాలకులు స్పందించి కాలువ గట్లను పరిశుభ్రం చేయాలని, వ్యర్థాలను తొలగించాలని నగర ప్రజలు కోరుతున్నారు.



పెచ్చులూడిన ఎంఈవో కార్యాలయం

భయం.. భయం..

దెందులూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంఈవో కార్యాలయ భవనం శ్లాబ్ పెచ్చులూడి పడడంతో సిబ్బంది భయం భయంగా పనిచేస్తున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం పక్కనే ఎంఈవో కార్యాలయాన్ని దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరి శ్లాబ్ పెచ్చులూడి పడుతోంది. అధికారులతో పాటు కార్యాలయ సిబ్బంది భయపడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, ఉద్యోగులు కోరుతున్నారు



చాటపర్రులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్





నామవరం, గుండుగొలనులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు

పల్లెలకు వెలుగు

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యేలు

ఏలూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులతో పల్లెలకు వెలుగు వస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మాదేపల్లి, చాటపర్రు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, సంక్రాంతి నాటికి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నంబూరి నాగరాజు, కాలారి శ్రీనాథ్, నేతల రవి, సైదు సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీలత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: చంద్రమ్మకాలనీ, రామన్నపాలెం, తాటియాకులగూడెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో రూ.20 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, కెఎల్.ప్రసాద్, చాత్రాతి ప్రసాద్, ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ శంకుస్థాపన చేశారు. మల్లాయిగూడెం, పోతునూరు, శివపురం, లింగగూడెం, చింతంపల్లి, సీతానగరం, వెంకటాద్రిగూడెం, నామవరం, వెంకటాపురం గ్రామాల్లో శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో 22 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. మండలంలో రూ.5.3 కోట్లతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. జగ్గవరపు ముత్తారెడ్డి, మాటూరి వెంకట్రామయ్య, గుత్తా వెంకటేశ్వరరావు, ఉపేంద్ర, కక్కిరాల నాగేశ్వరరావు, ముత్తా శేఖర్, సీహెచ్.ధర్మరాజు పాల్గొన్నారు.

● భీమడోలు: మండలంలోని గుండుగొలను గ్రామంలో రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో 20 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 8 కిలోమీటర్ల మెటల్ రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనులు చేపట్టామన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

25న ఎమ్మెల్యే గ్రీవెన్స్

కామవరపుకోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 25న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ గ్రీవెన్స్ నిర్వహిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండాలన్నారు.

కొండరెడ్ల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు

జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి



అటవీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న జేసీ

బుట్టాయగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని కొండరెడ్లు తయారు చేస్తున్న అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడంతోపాటు మెరుగైన ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని జేసీ, ఐటీడీఏ పీవో పి.ధాత్రిరెడ్డి తెలిపారు. గెడ్డపల్లి కొండరెడ్లు కె.కన్నాపురంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వన్ ధన్ వికాస్ కేంద్రాన్ని గురువారం జేసీ సందర్శించి అటవీ ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం డివిజినల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నూరు శాతం లక్ష్యాలను అధిగమించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో పీవీఎస్ నాయుడు, వెలుగు ఏపీడీ నాగేశ్వరావు, ఏపీఎంలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

కొయ్యలగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెంలోని పోస్ట్ మెట్రిక్ బాలికల హస్టల్‌ను గురువారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో పి.ధాత్రి రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. హస్టల్‌లో బాలికల వసతి, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. పారిశుధ్య నిర్వహణపై సూచనలు ఇచ్చారు. నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వారి వెంట ఏపీవో పీవీఎస్ నాయుడు, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి మంత్రి నాదెండ్లను కలిసిన నేతలు



నాదెండ్ల మనోహర్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఏలూరు నియోజకవర్గ జనసేన నాయకులు గురువారం అమరావతిలోని సచివాలయంలో కలిశారు. నారా శేషు, రెడ్డిఅప్పలనాయుడు, ఇళ్ల శ్రీనివాస్, పేకేటి ప్రసాద్ తదితరులు మంత్రికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్‌కు అభినందనలు తెలిపారు.

● జంగారెడ్డిగూడెం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను చింతలపూడి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నూజివీడు జనసేన ఇన్‌చార్జి బర్మా ఫణి బాబు, పంది మహేశ్‌బాబు, మాదాసు అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా : బడేటి చంటి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చరిత్రలో గుర్తుండిపోయేవిధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దళిత సంఘాల ప్రతినిధులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. కమ్యూనిటీహాలు నిర్మాణాన్ని చేపడతామన్నారు. సీహెచ్‌వీఎస్ వరప్రసాదరావు, దాసరి ఆంజనేయులు, మెండెం సంతోష్‌కుమార్, నేతల రమేష్‌బాబు, చాగంటి సంజీవ్, పాము శామ్యూల్, దాసరి రమేష్, మాణిక్యాలరావు, ప్రసాద్, మెండెం ఆనంద్, దాసరి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి కటాక్షాలు ఉండాలి

కనకదుర్గమ్మ కటాక్షాలు ప్రజలందరి పై ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. గురువారం తంగెళ్ళమూడి తిలక్‌నగర్‌లో కనకదుర్గమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు అత్యంత శోభాయమానంగా సాగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ వందనాల దుర్గాభవాని, వందనాల శ్రీనివాస్, అర్నేపల్లి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

కొయ్యలగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి ప్రసాద్ సూచించారు. పొగాకువేలం కేంద్రంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పొగాకు బోర్డు నిర్దేశించిన విస్తీర్ణం మేరకే పొగాకు పండించాలని, అంతకు మించి పండిస్తే రైతులు నష్టపోతారన్నారు. గత ఏడాది మాదిరి పొగాకు ధర ఉండే అవకాశాలు లేనందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బోర్డు కోటా మేరకే పొగాకుపంట వేసి మిగిలిన భూమిలో ప్రత్యామ్నయ పంటలు పండించాలని కోరారు. కార్యక్రమంలో సీటీఆర్‌ఐ సైంటిస్టు కస్తూరి కృష్ణ, వ్యవసాయ శాఖాధికారులు, ఆర్టికల్చర్ అధికారులు, బోర్డు అధికారులు పాల్గొన్నారు.

శివపురంలో ఎన్టీ రామారావు విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే

చింతలపూడి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శివపురంలో 30 ఏళ్ల కల నెరవేరిందని టీడీపీ శ్రేణులు ఆనందం చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ విగ్రహం రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లా టీడీపీ రైతు విభాగం అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో టీడీపీకి బలమైన నాయకత్వం ఉందని, 30 ఏళ్లుగా నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలని భావించిన తమ కల ఇన్నాళ్ళకు నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు జాతి గౌరవం నింపిన వ్యక్తిఅని, పేద, బడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన ఆశాజ్యోతి అని పేర్కొన్నారు. జె.ముత్తారెడ్డి, ఎం.వెంకటరామయ్య, కలపాల వెంకటేశ్వరరావు, పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కైకరం ఉన్నత పాఠశాలలో మాక్ ఎన్నిక



ఎన్నికల నిర్వహణలో విద్యార్థులు

ఉంగుటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైకరం హైస్కూలులో దేశ్ అప్నాయాన్ సహయోగా ఆధ్వర్యంలో మాక్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. ఎన్నికలకు అధికారిగా పండూరి కన్నారావు వ్యవహరించారు. ఎన్నికలలో అధ్యక్షురాలిగా కొడుదుల వర్షిత, ఉపాధ్యక్షురాలిగా లింగంపల్లి అర్పిత ఎన్నికయ్యారని హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. ఈ మాదిరి ఎన్నికల నిర్వహణలో సోషల్ ఉపాధ్యాయులు గొల్లపల్లి గవరయ్య, కె.గంగా మహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఫ్లైఓవర్ నిర్మాణానికి కొలతలు

జాతీయ రహదారిపై కైకరం వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి హైవే, రెవెన్యూ సర్వే సిబ్బంది గురువారం కొలతలు వేశారు. నిర్వాసితులు మాత్రం మరోసారి న్యాయపోరాటం చేస్తామంటున్నారు. హైవే డి.టి. సత్యనారాయణ,మండల సర్వేయర్ విశ్వనాథ్, సర్వేయర్లు మణికంఠ, వంశీ, వీఆర్వో భీమవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలలు హక్కులపై అవగాహన పెంచుకోవాలి

ఏలూరు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాలల హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు గ్జేవియర్ నగర్‌లో సెయింట్ గ్జేవియర్ బాలుర వసతి గృహాన్ని గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల సౌకర్యాలపై ఆరా తీశారు. పరిశుభ్రత, మంచినీరు, ఆహారం, వైద్యం, రక్షణ సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. హస్టల్ వార్డెన్ ఫాదర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

దోమపోటుతో వ్యాధులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దోమకాటువల్ల సంక్రమించే ప్రాణాంతక వ్యాధులపై జేపీ కాలనీ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ దోమల ద్వారా డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. అర్బన్ హెల్త్‌సెంటర్లలో పరీక్షలు, వైద్య సలహాలు సద్వినియోగంచేసుకోవాలన్నారు. డాక్టర్ నీలిమ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

పెదపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెదపాడులో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో పరిశుభ్రమైన తాగునీరు అందించాలని సీపీఎం మహాసభ డిమాండ్ చేసింది. గురువారం జరిగిన మహాసభ పలు ప్రజా సమస్యలపై తీర్మానాలను చేసింది. సీపీఎం పెదపాడు శాఖా కార్యదర్శిగా గుండపనేని సురేష్ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధులను మళ్లిస్తున్న నాయకులు

బుట్టాయగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ వారోత్సవాల నిధులను మళ్లిస్తున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు పి.మంగరాజు డిమాండ్ చేశారు. రెడ్డిగణపవరంలో రూ.20 లక్షలతో జనసంచారం లేని ప్రాంతాలకు సీసీ రోడ్లు వేస్తున్నారని తెలిపారు. ఒక రాజకీయ నాయకుడి ఇంటికి 130 మీటర్ల రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. గిరిజన గ్రామాల్లో పల్లె పండుగ నిధులు ఖర్చుచేయాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందించినట్లు మంగరాజు తెలిపారు. కార్యక్రమంలో కోర్స జలపాలు, కుంజా రవి, కె.రామచంద్ర, పి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీట్ బెల్ట్ ధరించాలి : సీఐ

లింగపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సీఐ రవీంద్ర సూచించారు. మండలం ధర్మాజీగూడెంలో ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

ఎద్దుల అక్రమ రవాణా

భీమడోలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాహనంలో ఎద్దులను అక్రమంగా తరలిస్తుండగా సూరప్పగూడెం బస్టాండు వద్ద గురువారం నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎద్దులను తరలిస్తున్న కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎద్దులను పెదపాడు గో సంరక్షణ సమితికి తరలించారు. కేరళకు చెందిన జిజియో సిజే, షానిమాన్ ఓం, రోబిన్ ఎంబి, జబీర్ సీఎన్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

నివాసాల వద్ద మద్యం వద్దు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలను ప్రజల నివాసాలు, దేవాలయాలు, పాఠశాలల సమీపంలో ఏర్పాటు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

చిరస్మరణీయుడు వాల్మీకి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎస్పీ



సీఆర్ఆర్ కళాశాలలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి

ఏలూరు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామాయణ రచయిత వాల్మీకి చిరస్మరణీయుడని ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి స్వయంగా రామాయణంలో ప్రధాన పాత్రలో కనిపిస్తారన్నారు. భావితరాల వారికి ఆదర్శప్రాయమైన కావ్య రచన చేసిన మహా పండితుడు వాల్మీకి అన్నారు. ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ శ్రీహరి, బీఎస్ఆర్ నాయక్, డీసీఆర్బీ సీఐ డి విజయ్‌కుమార్, ఆర్ఎస్ఐలు భాస్కరరావు, శివప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్: సీఆర్ఆర్ కళాశాలలో వాల్మీకి జీవిత విశేషాలపై అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. సంస్కృత అధ్యాపకుడు ఆచార్య మాట్లాడుతూ వాల్మీకి జీవిత విశేషాలు వివరించారు. వాల్మీకి చిత్రపటానికి ప్రిన్సిపాల్ రామరాజు తదితరులు పూలమాలలు వేశారు. హిందీ అధ్యాపకురాలు సుమిత్ర, శంకర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గిరిబాబు నివాళులర్పించారు. సీపీడీసీ సభ్యులు లేళ్ళ వెంకటేశ్వరరావు, దిడ్ల ఏంజిలో, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు పరమేశ, వెంకట్రావు, విజయ్ కుమార్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించడం గొప్ప విషయమని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు వాల్మీకి జయంతిని నిర్వహించారు. నందిగం సీతారామతిలక్, మాగంటి హేమ సుందర్, వీ.ప్రతాప్, నందిగం రవిచంద్ర, సీహెచ్.సుమన్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు ఎం.శ్యామలబాబు, అపర్ణకుమార్, కృష్ణారావు, సందీప్‌కుమార్, అస్లాంబాష పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్ అధ్యక్షతన వాల్మీకి జయంతి జరిగింది. వాల్మీకి రచించిన రామాయణం విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: రావికంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం ఉమ్మడి భీమరాజు, బిరుదుగడ్డ నాగేశ్వరరావు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్‌కుమార్, నాగేశ్వరరావు, రమేష్, బాలాచలం, మురళీ, రాధాకృష్ణ, దేవప్రియ, విజయకుమారి, చైతన్య సుజాత, జయశ్రీ, ప్రియాంక, రాజశ్రీ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి జాతికి ఆయన అందచేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దారావతు మల్లేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● భీమడోలు: శాఖా గ్రంథాలయం, తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. కె శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వాల్మీకి చిత్రపటానికి సుధాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది, అధికారులు, వీఆర్వోలు వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

నేటి నుంచి రీసర్వే గ్రామసభలు

ఏలూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 664 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 252 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 18 నుంచి నవంబరు 14 వరకు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. భూ యజమానులకు రీసర్వే అయిన భూములపై అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా గ్రామసభల్లో తెలియజేయాలన్నారు. సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

విజేతలకు బహుమతులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 11న వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, పెయింటింగ్, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు గురువారం డీఎంహెచ్‌వో శర్మిష్ట బహుమతులను అందజేశారు. హెచ్ఎంలు లక్ష్మణరావు, జ్యోతి పాల్గొన్నారు.

డీపీవోతో జడ్పీ చైర్‌పర్సన్ సమీక్ష

ఏలూరుసిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జడ్పీ క్యాంప్ కార్యాలయంలో డీపీవో కె అనూరాధతో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులు, మంచినీటి సరఫరా పథకాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు.

టెట్‌కు 39 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో (టెట్) గురువారం 39 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 185 మంది అభ్యర్థులకు 161మంది, మధ్యాహ్నం 185 మందికి 170 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలిపారు.

మద్యం షాపులు ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

టి.నరసాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో మద్యం దుకాణాలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గురువారం ప్రారంభించారు. మక్కినవారిగూడెం, టి.నరసాపురం షాపులను ఎమ్మెల్యే, బొర్రంపాలెంలో దుకాణాలను జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి ప్రారంభించారు.

వీఆర్ఏలకు కనీస వేతనం అమలు చేయాలి

కుక్కునూరు, అక్టోబరు 17: వీఆర్ఏలకు కనీస వేతనం అమలు చేసి నామినీలను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయికిరణ్ డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ రెవిన్యూ సహాయకులు చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ గడవక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీఆర్ఏల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అన్నారు. వెంకన్నబాబు, కాకర్ల శ్రీను, కె.మోహనరావు, మారుతి, సుజాత పాల్గొన్నారు.

శ్రీవారి క్యాలెండర్లు ఆవిష్కరణ

ద్వారకాతిరుమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయ నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీని ఆలయ చైర్మన్ రాజా ఎస్వి సుధాకరరావు, అనువంశిక ట్రస్టీ నివృతరావు, ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి, ఈఈ భాస్కర్ గురువారం ఆవిష్కరించారు. 2025 సంవత్సర సింగిల్ పేజీ క్యాలెండర్ రూ.35, మల్టీ పేజెస్‌తో ఉన్న క్యాలెండర్ రూ.120, డైరీ రూ.150 ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సెక్యూరిటీకి అభినందన

ద్వారకాతిరుమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో పర్సు పోగొట్టుకున్న భక్తురాలికి తిరిగి అప్పగించిన సెక్యూరిటీ నిజాయితీని ఆదర్శంగా తీసుకోవాలని ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు కోరారు. ఇటీవల ఓ భక్తురాలు రూ.15వేలుతో ఉన్న పర్సు పోగొట్టుకుంది. దానిని చూసిన సెక్యూరిటీ శివప్రసాద్ తిరిగి ఆ భక్తురాలికి అందజేశాడు. ఆలయ చైర్మన్ సెక్యూరిటీ శివప్రసాద్‌ను పిలిపించి అతడిని అభినందించారు.

పెరిగిన కూరగాయల ధరలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు మళ్లీ పెరిగాయి. రైతుబజారులలో కిలో టమోటా రూ.48, వంకాయలు రూ.58, వంకాయలు రూ.54, బెండ రూ.28, మిర్చి రూ.48, కాకర రూ.34, బీర రూ.40, క్యాబేజి రూ.36, బెంగుళూరు క్యారెట్ రూ.54, క్యారెట్ రూ.50, దొండ రూ.34, బంగాళ దుంప రూ.40, ఉల్లి రూ.35, గోరుచిక్కుడు రూ. 32, చిక్కుడు రూ.94, దోస రూ.44, బీట్‌రూట్ రూ.48, కీరదోస రూ.36, అల్లం రూ.150, క్యాప్సికం రూ.70, ఆకాకర రూ.100, ఆనప ఒక్కింటికి రూ.25, అరటి ఒక్కటికి రూ.7, పాలకూర, చుక్కకూర, మెంతుకూర, తోటకూర కట్ట ఒక్కింటికి రూ.10, పొట్లకాయ రూ.25, మహారాష్ట్ర ఉల్లి రూ.54, షోలాపూర్ ఉల్లి కొత్తవి రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు.

రహదారి భద్రత పాటించాలి

వాహన డ్రైవర్లకు కౌన్సెలింగ్

ఏలూరు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు సూచించారు. త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ద్విచక్ర వాహనదారులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల చాలా మంది యువత రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ వల్ల ఎంతో రక్షణ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరు వారి కుటుంబాల కోసం, వారిపై ఆధారపడిన వారి కోసం వాహనాలు నడిపి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సీఐ సూచించారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కామినేని



పెదలంకలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పల్లెలను అభివృద్ధి చేయటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గురువారం పెదలంకలో రూ.34.15 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు కలిదిండిలో రూ.138.8 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పల్లె పండుగతో రహదారులకు మహర్దశ పట్టిందన్నారు. తొలుత కంటి ఆపరేషన్ చేయించుకున్న టీడీపీ సీనియర్ నాయకుడు డి.భోగేశ్వరరావును పరామర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పి.జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వి.శ్రీనివాస్ చౌదరి, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వి.నరసింహరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎ.శ్రీనివాస్, డీసీ మాజీ చైర్మన్లు ఎం.భోగేశ్వరరావు, పి.సత్య నారాయణ, తెలుగు రైతు ఉపాధ్యక్షులు డి.పరమేశ్వరరావు, ఎ.వెంకటాచలం, పెదలంక, కలిదిండి సర్పంచ్‌లు ఎం.లక్ష్మీ రామకృష్ణ, ఎం.మారుతి ప్రసన్న, పంచాయతీ రాజ్ ఏఈఈ శ్రీనివాస్, ఉపాధి ఏపీవో ఆనంద్ పాల్గొన్నారు.

పల్లె పండగ

● కైకలూరు (మండవల్లి) : మండవల్లి మండలంలోని ఉనికిలి మోకసాకలవపూడి గ్రామాల్లో పల్లెపండుగ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణాలకై కూటమి నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్డీఏ నాయకులు భూమిపూజ చేశారు. సీహెచ్.కోటయ్య, ఎం. సత్తిబాబు, ఎన్.వీరబాబు, ఎన్.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : పెదకామనపూడి, చినకామనపూడి గ్రామాల్లో గురువారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు గ్రామాల్లో సుమారు రూ.14 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వి.నరసింహరావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కె.వినోద్ శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు సీహెచ్.నాంచారయ్య, ఎస్.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు



నూజివీడులో జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యులు

నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17: నిర్దిష్ట టీకా లక్ష్యాలను చేరుకునేందుకు పశు వైద్యులు చర్యలు చేపట్టాలని నూజివీడు పశు సంవర్థక శాఖ డీడీ చంద్రశేఖర్‌రావు అన్నారు. నూజివీడు డివిజన్ పరిధిలోని పశు వైద్యాధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. నెలాఖరు లోపు నట్టల నివారణ మందులను జీవాలకు అందించాలన్నారు.

● నూజివీడు టౌన్ : బత్తులవారిగూడెంలో సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని సర్పంచ్ ఎం.లక్ష్మి కాంతమ్మ ప్రారంభించారు. ఈ నెల 31 వరకు 1,925 జీవాలకు నట్టల నివారణ మందులను ఉచితంగా అందించనున్నట్లు పశు వైద్యాధికారి అభిలాష్ తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజ పాల్గొన్నారు.

● ముసునూరు : మండలంలోని రెండు గ్రామాల్లో ఉన్న గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి నివారణ మందును పశువైద్య సిబ్బంది వేశారు. ముసునూరులో నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కె.ఉదయ్‌కిరణ్, ఉప సర్పంచ్ టి.శ్రీనివాసరావు, కాట్రేనిపాడులో సర్పంచ్ భర్త జి.మోహన్‌రావు జీవాలకు నట్టల మందు వేశారు. పశువైద్యాధికారి ఎం.వెంకట చైతన్య తెలిపారు. నియోజకవర్గ బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.యోహాను, నాయకులు ఆర్.బాలకృష్ణ, గొర్రెల సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

విగ్రహాలను తొలగించిన ఎన్‌హెచ్ అధికారులు



ముదినేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నెంబర్ 165 పామర్రు-నర్సాపురం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లిలోని పలువురు నాయకుల విగ్రహాలను తొలగించే పనులను జాతీయ రహదారి అథారిటీ అధికారులు చేపట్టారు. ముదినేపల్లి పోలీస్ స్టేషన్, ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలను, బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం క్రేన్ సహాయంతో తొలగించి వాటిని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉంచారు. అయితే అంబేడ్కర్ విగ్రహం తొలగింపులో అధికారులు అనుసరించిన తీరు సరైనది కాదని స్థానిక విగ్రహ కమిటీ కన్వీనర్ ఎన్.భిక్షాలు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బి.రవీంద్రబాబు, మండల శాఖ అధ్యక్షుడు పి.విజయ సాగర్ విమర్శించారు. అంబేడ్కర్ విగ్రహ కమిటీ నాయకులకు గానీ, దళిత సంఘాల నాయకులకు గానీ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా విగ్రహాన్ని తొలగించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉంచటం అవమానకర విషయమని పేర్కొన్నారు. విగ్రహాన్ని అధికారులు ప్రతిష్ఠించే వరకు తాము జాతీయ రహదార్ల పనులను అడ్డుకుంటామని రవీంద్రబాబు స్పష్టం చేశారు.

మహిళ ఆత్మహత్య

కైకలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కైకలూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు వైఎస్సార్‌కాలనీలో నివశిస్తున్న పూజారీ అనురాధ (35) కూలీపని చేసుకుంటు జీవిస్తుంది. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తుంది. ఇటీవల ఓ వ్యక్తితో సహజీవనం చేస్తుంది. అతనికి ఇటీవల పెళ్ళి కుదరడంతో ఇరువురి మధ్యన గొడవలు జరిగి మనస్థాపానికి గురై నివసిస్తున్న రేకుల షెడ్డులో బుధవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమివ్వగా సంఘటనా స్థలానికి వెళ్లే సరికే ఆమె మృతి చెంది ఉంది. అయితే వారి కుటుంబ సభ్యులు ఆమె మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు ముందుకు రాకపోవడంతో పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి సొంత ఖర్చుల తో పారిశుధ్య కార్మికుల ద్వారా దహనసం స్కారాలు నిర్వహించినట్లు తెలిపారు. దీనిపై ఏఎస్సై మల్లికార్జునరావు అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మికం





సింహవాహనంపై..శ్రీవారి రాజసం

ద్వారకాతిరుమల, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): చినవెంకన్న ఆశ్వయుజమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహవాహనంపై అలివేలు మంగ, ఆండాళ్ అమ్మవార్ల సమేతంగా కొలువైన ఆ దేవదేవుడు గురువారం ఉదయం క్షేత్ర తిరు వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను సింహవాహనంపై ఉంచి, అర్చకులు పూలతో అలంకరించారు. యోగ మూర్తిగా అభయ హస్తాన్ని ఇస్తూ ఉన్న శ్రీవారికి నీరాజనాలు సమర్పించారు. తరువాత అట్టహాసంగా తిరు వీధులకు తరలివెళ్లిన స్వామి, అమ్మవార్లను భక్తులు కొలిచారు. దుష్ట జన సంహారానికి, భక్తజన సంరక్షణకు సంకేతంగా స్వామి సింహవాహనంపై ఊరేగారు. ఇలా ఉన్న శ్రీవారిని దర్శిస్తే భయం, బాధలు తొలుగుతాయన్నది భక్తుల నమ్మకం.

జగన్మోహిని అలంకారంలో..

అపురూప లావణ్యాలను ఒలికిస్తూ.. మోహినీ అలంకారంలో శ్రీవారు గురువారం భక్తజనులకు దర్శనమిచ్చారు. క్షీర సాగర మదనంలో ఉద్భవించిన అమృతాన్ని దేవ, దానవులకు పంచేందుకు శ్రీమహావిష్ణువు స్త్రీ రూపంలోకి మారారు.

వాల్మీకి జయంతి



ముసునూరులో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, తదితరులు

ముసునూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కార్యాలయంలో ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ బిఏ సత్యనారయణలు మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వాల్మీకి రాముడి జీవిత చరిత్ర రామాయణ మహా కావ్య రచన చేసి ఆదికవి అయ్యారన్నారు. సూపరింటెండెంట్ డి.చాయాకుమారి, కార్యాదర్శి ఎ.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● కలిదిండి : వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను కలిదిండి గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు, విద్యార్థులు, సిబ్బంది వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేటి నుంచి గ్రామ సభలు

కలిదిండి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : భూ రీ సర్వే గ్రామసభల్లో అర్జీలను స్వీకరించి సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో అచ్యుతా అండరిష్ అన్నారు. గురువారం కలిదిండి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలిదిండి మండలంలో భూ రీ సర్వేపై ఈ నెల 18 నుంచి నవంబరు 1వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నామన్నారు. తహసీల్దార్ రామకృష్ణ, ఆర్‌ఐ శ్యామల, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు. అలాగే ముసునూరు, కైకలూరు, ముదినేపలి మండలాలో రీ సర్వే గ్రామ సభలను ఈ నెల 18 నుంచి 24వ తేదీ న జరుగుతాయని ఆయా మండలాల ఇన్‌చార్జి తహసీల్దార్‌లు డి.పురుషోత్తమశర్మ, ఎండీ ఇబ్రహీం, తహసీల్దార్ సుభానీ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్లాన్ సిద్ధం కావాలి

ముదినేపల్లి : ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను నిర్వహించటంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అప్రమత్తతగా ఉండాలని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ తెలిపారు. ముదినేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన పలు అంశాలపై తహసీల్దార్ సుభానీ, సివిల్ సప్లయిస్ డీటీ కుమారితో చర్చించారు. రేషన్ డిపోలు, ఎండీయూ వాహనాల నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



ఆగిరిపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై అవగాహనలో భాగంగా ఏపీ హెచ్‌ఎస్ఎస్సీ (ఢిల్లీ) ఐపీఏ ఆడిట్ టీమ్ సభ్యురాలు జైత్ర నేతృత్వంలో ఈదర పీహెచ్‌సీని గురువారం కేంద్ర బృందం సందర్శించింది. పీహెచ్‌సీ రికార్డ్స్, రిపోర్ట్స్ పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యంపై ఆమె ఆరా తీశారు. వార్డులు, రక్త పరీక్షల పరికరాల పనితీరును పరిశీలించారు. ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ సాయి సుధా, ఈదర పీహెచ్‌సీకి సంబంధించిన సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.

వేదఘోష

కైకలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణం వేదఘోషతో గురువారం మార్మోగింది. శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో 58వ వేదవిద్వత్ సభ నిర్వహించారు. దేవీశరన్నవ రాత్రి సందర్భంగా ఘణాపాటిలు, క్రమపాటిలు, వేదపండితులు మొత్తం 95 మందితో సభ నిర్వహించారు. ఆలయ అధికారి వీఎన్‌కే శేఖర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు.

అల్లుకుపోతున్న తీగలు

ఒరిగిపోతున్న స్తంభాలు



తహసీల్దార్ కార్యాలయ సమీపంలో..



ముసునూరు-వలసపల్లి ప్రధాన రహదారిలో..

ముసునూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఎప్పుడూ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి శనివారం తీగలు, స్తంభాలు మరమ్మతులని గంటల తరబడి విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పనులు చేయడం లేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. ముసునూరు నుంచి వలసపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో రైతుల పొలాల్లో నుంచి వెళ్ళిన 11 కేవీ విద్యుత్ లైన్‌లో పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి తీగలపై ఆధారపడి ప్రమాదకరంగా ఉన్నాయి. పొలాల్లో పనిచేసే రైతులు ఆందోళ చెందుతున్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న విద్యుత్ లైన్‌కు తీగజాతి పొదలు, పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రమాదకర సమస్యలను పరిష్కరించేలా జిల్లా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

జానపద నృత్యంలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

కైకలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జానపద నృత్యాల్లో మూడో స్థానం సాధించడంపై ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అభినందనలు తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఏలూరులో జరిగాయి. జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థిలు పాల్గొన్నారు. కైకలూరు కళాశాలకు చెందిన విద్యార్థులు జానపద నృత్యాల్లో మూడో స్థానాన్ని సాధించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల వినూత్న ప్రదర్శన



ఎన్నికైన విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ అధికారులు

నూజివీడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వినూత్న పరిష్కారాలను ప్రదర్శించి తమ ప్రతిభను కనబరిచారని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్, ఏవో లక్ష్మణరావు తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ కేంద్రంగా పారాబోలా-9 సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15,16 తేదీల్లో హ్యాకథాన్ నిర్వహించగా, మొత్తం 12 జట్లు పాల్గొని తమ వినూత్న పరిష్కారాలను ప్రదర్శించాయన్నారు. ఈ హ్యాకథాన్ ద్వారా విద్య, పరిశ్రమల మధ్య అంతర్యాన్ని తగ్గించేందుకు అవకాశం ఏర్పడిందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. పారాబోలా సంస్థ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ ప్రణవ మూర్తి, డీన్‌ఆఫ్ అకాడమిక్స్ శ్రావణి, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.ప్రసాద్, సీఎస్ఈ హెచ్‌వోడీ డీవీ నాగార్జునాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముసునూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట జడ్పీ పాఠశాల విద్యార్థులు ఫెన్సింగ్ ఆటలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 15న ఎన్టీఆర్ జిల్లా నున్నలో స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో అండర్-14, విభాగంలో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు, అండర్-17 విభాగంలో ఇద్దరు బాలురు, ఒక బాలిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పసుమర్తి రామకృష్ణ తెలిపారు. వీరు త్వరలో నంద్యాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఉమ్మడికృష్ణ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ వాకా నాగరాజు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు క్రీడాకారులను గురువారం అభినందించారు.

రైల్వే ప్రయాణికులకు తీపి కబురు

అడ్వాన్స్ రిజర్వేషన్ బుకింగ్ రెండు నెలలకు కుదింపు



నరసాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికులకు గురువారం ఆ శాఖ తీపికబురు చెప్పింది. అడ్వాన్స్ రిజర్వేషన్ టిక్కెట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వస్తున్న విమర్శల్ని పరిగణలోకి తీసుకుని టిక్కెట్ బుకింగ్ సమయాన్ని 60 రోజులకు తగ్గించింది. అంటే నాలుగు నెలల ముందుగా అడ్వాన్స్ రిజర్వేషన్ చేయించుకోవాల్సిన అవసరం లేదు. రెండు నెలలు ముందుగా బుకింగ్ చేసుకుంటే సరిపోతుంది. ఈ కొత్త విధానం వచ్చేనెల నుంచి అమల్లోకి రానుంది. ఇప్పటి వరకు రిజర్వేషన్ బెర్త్‌ల్లో ప్రయాణించాలంటే 120 రోజుల ముందుగా మేల్కోవాల్సి వచ్చేది. పండుగలు, వేసవి సెలవులకు దూర ప్రాంతాలు, స్వగ్రామాలకు రావాలంటే నాలుగు నెలల ముందుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకోవడం తప్ప నిస రిగా ఉండేది. లేకపోతే దొరకని పరిస్థితి. సంక్రాంతి, దసరా, వేసవి సెలవులకు రోజులు లెక్కించుకుని అడ్వాన్స్‌గా రిజర్వేషన్ బుక్ చేసుకోవాల్సి వచ్చేది. ఈ విధానం వల్ల కొన్ని సమయాల్లో టిక్కెట్లు రద్దు చేసుకోవాల్సి వచ్చేది. దీంతో భారీగా కోత పడేది. కొన్ని సమయాల్లో సగం డబ్బులు కూడా తిరిగి వచ్చేవి కావు. ఈ వ్యవధిని 60 రోజులకు కుదించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. చివరికి రైల్వే స్పందించి రెండు నెలల ముందుగా టిక్కెట్ల బుక్ చేసుకునే వెసులు బాటు కల్పించింది. దీని వల్ల జిల్లాలో ఎప్పుడు రద్దీగా ఉంటే నరసాపురం, నాగర్‌సోల్, తిరుపతి, సర్కార్, శేషాద్రి వంటి రైళ్లకు ప్రయాణ వ్యవధిని బట్టి 60 రోజులు ముందు గానే బుక్ చేసు కోవచ్చు. ప్రయాణ వ్యవధి తక్కువగా ఉన్నందున టిక్కెట్ల రద్దు కూడా తగ్గుతుంది.

మునిసిపల్ టీచర్ల సత్యాగ్రహ దీక్ష



సత్యాగ్రహదీక్షలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలు తెరవాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పండిట్, పీఈటీ పోస్టులను అప్ గ్రేడ్‌చేసి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఖాళీగా వున్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైనవారికి పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీచేయాలన్నారు. పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించా లన్నారు. అప్‌గ్రేడ్‌చేసిన ప్రాథమి కోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల నియామకాలను చేపట్టా లన్నారు. టీచర్ల సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబరు 24న పాఠశాలవిద్య కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడ తామని హెచ్చరించారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు.

26 వరకు ఐటీఐలో ప్రవేశాలు

ముదినేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌పీఎం ఐటీఐ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్లు చేపట్టేందుకు సాంకేతిక విద్యా మండలి అధికారులు అనుమతి ఇచ్చారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఆ కళాశాలలో డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 26లోగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. ఒక సంవత్సరం కాలపరిమితి కలిగిన ఈ కోర్సులో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గల వారు సెల్ నెంబర్ 90006 20922లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మొరాయించిన రైల్వేగేటు



కైకలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైలు వస్తుందని గేటు వేయగా అది మూసుకోకనని మొరాయించింది. గురువారం సాయంత్రం నర్సాపురం నుంచి హుబ్లీ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలు కైకలూరు రైల్వేస్టేషన్‌కు వచ్చింది. ఆ సమయంలో కైకలూరు-కలిదిండి ఆర్‌అండ్‌బీ రహదారిలో ఉన్న రైల్వేగేటును ప్రయాణికుల రాకపోకలు లేకుండా వేశారు. అయితే గేటుకు ఒకవైపు మూసుకోకపోవడంతో కొద్దిసేపు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో గేట్‌మేన్ హుటాహుటిన వెళ్లి ఇనుపగొలుసుతో అడ్డు పెట్టి రాకపోకలను నిలిపివేశారు. రైలు వెళ్లిన తరువాత గేటు మరమ్మతులు నిర్వహించారు.

తాగుబోతులకు అడ్డాగా వరాహ పుష్కరిణి



ఆగిరిపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి వేద పాఠశాల విద్యార్థులు ఆగిరిపల్లి వరాహ పుష్కరిణిని నెలరోజుల పిచ్చి మొక్కలన్ని తొలగించి శుభ్రం చేశారు. ఇప్పుడది తాగుబోతులకు అడ్డాగా మారింది. తాగుబోతులు చల్లగాలికి వరాహ పుష్కరిణికి చేరి మద్యం తాగుతూ సీసాలు అక్కడే పగలగొడుతున్నారు. ఎంతో పేరుగాంచిన వరాహ పుష్కరిణి ఇలా తాగుబోతులకు అడ్డాగా మారడం సమీప వాసులను భీతి గొల్పుతుంది. ఈ విషయమై ఎస్సై శుభశేఖర్‌ను వివరణ అడగ్గా తక్షణం చర్యలు తీసుకుంటామని మాట ఇచ్చారు.

బంగారు నాణేలు అందజేత

చాట్రాయి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకంలో నూతన జంటలకు బంగారు నాణేలకు గురువారం అందజేశారు. మంకొల్లు, కోటపాడు పాల సహకార సంఘాలకు పాలుపోస్తున్న పి.తిరుపతరావు, వై.ప్రసాద్ కుమార్తె వివాహాలు సందర్భంగా ఒక్కొక్కరికి రూ.20 వేలు విలువైన బంగారు నాణేలను సంస్థ డైరెక్టర్ బి.రామచంద్రరావు, సంఘాల అధ్యక్షుడు ఇ.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు అందజేశారు. టీడీపీ నాయకుడు పి.రాంబాబు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

ముసునూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు నాటాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రాజ్యలక్ష్మీ, ధనలక్ష్మీ అన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం మొక్కలను కార్యకర్తలు, ఆయ్యాలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలని సూపర్‌వైజర్లు కోరారు. సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు

ఆగిరిపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ అవయవాల ద్వారా వైకల్యాన్ని అధికమించాలని విజయవాడ నగరపాలక సంస్థ 23వ డివిజన్ కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి అన్నారు. తోటపల్లిలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో శైలజ, ఖాత, సువర్ణ, నవ నిర్మాణ్ గ్రూప్ డైరెక్టర్ ఏపీసాయినాథ్‌ల ఆర్థిక సాయంతో విజయవాడకు చెందిన కె.గజేంద్రరావు, ఎ.హేలి, ఎ.దుర్గా సత్యావతిలకు కృత్రిమ కాళ్ళను గురువారం అందజేశారు. సంఘ సేవకురాలు గౌరా, జ్యోతి కుమారి, ఉయ్యూరు లక్ష్మి, డి.చైతన్య, ఎస్.సాయితేజ, హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డ్డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి టి.లక్ష్మి, సీఈవో పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయాలి

కైకలూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాది హామీ పథకం నిర్వహణపై క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఇన్‌చార్జి ఎండీవో ప్రకాశరావు అన్నారు. వెలుగు కార్యాలయంలో గురువారం జిల్లా రీసోర్స్ పర్సన్స్‌కు, ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు సామాజిక తనిఖీలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రతీ పనిని జిల్లా రీసోర్స్ పర్సన్స్ పూర్తిస్థాయిలో పరిశీలించి సక్రమమైన నివేదికలు అందించాలన్నారు. ఏపీవో చరణ్, రాష్ట్ర రీసోర్స్‌పర్సన్ సూర్యచక్రం, పంచాయతీరాజ్ ఏఈ సాదిక్‌బాషా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెప్మా స్టాల్స్

నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 17: స్థానిక మున్సిపల్ ఆఫీసు వద్ద మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. ఆర్గానిక్ ఉత్పత్తులు, వస్త్ర, అలంకార, మామిడి ఉప ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్ పలువుర్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సీహెచ్ దుర్గా ప్రసాద్, ఇతర కౌన్సిలర్స్ మెప్మా స్టాల్స్‌ను పరిశీలించారు. వినియోగదార్లకు ఉపయోగపడేలా మహిళా సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులను తక్కువ ధరకు అందించేలా చూడాలని ఆయన సూచించారు.